
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



ప్రతిపాదనలకే పరిమితం



- మరమ్మతులు, నిర్మాణాలకు శ్రీకారం
- జిల్లాకు రూ.107.23 కోట్లు
- గుంతలు పూడ్చలేని వైసీపీ ఐదేళ్ల పాలన
- కూటమి ప్రభుత్వం వచ్చాక మరమ్మతులపై ప్రత్యేక దృష్టి
- ప్రారంభం కాని పనులు

గత వైసీపీ ప్రభుత్వం రహదారుల మరమ్మతులను గాలికొదిలేసింది. అడుగుకో గుంత.. అవస్థలు జనజీవనం..! అన్నట్లుగా రోడ్ల పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చాక తక్షణమే రహదారులపై గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టింది. అధ్వానంగా మారిన 972 కిలోమీటర్ల రోడ్లను రూ.2.62 కోట్లతో గుంతలు పూడ్చేసి ప్యాచులు వేశారు. వాహనదారులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు. అయితే.. ఇటీవల భారీ వర్షాలకు ప్యాచులు లేచిపోయి రోడ్లు మళ్లీ యథాస్థితికి వచ్చాయి. 'మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్' పేరుతో కూటమి ప్రభుత్వం మరమ్మతులు, నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. వివిధ పథకాల కింద జిల్లాకు రూ.107.23 కోట్లు మంజూరు చేసింది. దశాబ్దన్నర కాలంగా అభివృద్ధికి నోచుకొని ధాణాపురం-హొళగుంద, ఎమ్మిగనూరు-మాలపల్లి-కోసిగి, బైచిగేరి క్రాస్-కపటి-పెద్దకడబూరు రహదారులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. శాశ్వత నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. త్వరలోనే పనులు మొదలు పెట్టేందుకు రోడ్డు భవనాల శాఖ ఇంజనీర్లు సన్నాహాలు చేస్తున్నారు.

కర్నూలు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రోడ్ల మరమ్మతులు ప్రతిపాదనలకే పరిమితమేనా? లేక ఆచరణ జరుగుతుందా? జిల్లా రోడ్లు భవనాల శాఖ పర్యవేక్షణలో స్టేట్ హైవే (ఎస్‌హెచ్) రహదారులు 599.893 కి.మీలు జిల్లా ప్రధాన రోడ్లు (ఎండీఆర్) 1,286.624 కి.మీలు కలిపి 1.886.517 కిలో మీటర్లు పొడవు ప్రధాన రహదారులు ఉన్నాయి. కర్నూలు, ఆదోని డివిజన్ల పరిధిలో రోడ్లు భవనాల శాఖ ఇంజనీర్లు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. అయితే.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలపై నిర్లక్ష్యం వాహనదారులకు శాపంగా మారింది. రాష్ట్ర విభజన తరువాత ఏర్పడిన సీఎం చంద్రబాబు సారథ్యంలోని టీడీపీ ప్రభుత్వం రహదారులు నిర్వహణపై ఫోకస్ పెట్టింది. జగన్ ప్రభుత్వం వచ్చాక ఐదేళ్లు మరమ్మతులు కూడా చేపట్టకపోవడం, నిధులు మంజూరైన రోడ్లను కూడా వేయకపోవడంతో వాహనదారులు చాలా ఇబ్బందులు పడ్డారు. 2024 జూన్ 12న సీఎం చంద్రబాబు సారథ్యంలో వచ్చిన కూటమి ప్రభుత్వం మళ్లీ రోడ్ల మరమ్మతులపై దృష్టి సారించింది. తాత్కాలికంగా గుంతలు పూడ్చి అతుకులు వేసినా, భారీ వర్షాలతో మళ్లీ అధ్వానంగా మారాయి. వాస్తవ పరిస్థితులను ముందే గుర్తించిన ప్రభుత్వం శాశ్వత మరమ్మతులు, కొత్త రహదారుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. వివిధ నియోజకవర్గాల్లో ప్రధాన రోడ్ల తాజా పరిస్థితిపై ఆంధ్రజ్యోతి బృందాలు పరిశీలించాయి. వర్షాలకు గుంతలు మయంగా మారిన రోడ్ల మరమ్మతులు తక్షణమే చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వివిధ రోడ్ల తాజా పరిస్థితి ఇది:

- ధాణాపురం - హొళగుంద వయా హెబ్బటం రహదారి 25 కి.మీ ఉంది. దాదాపు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలను కలిపే ప్రధాన రోడ్డు ఇది. దాదాపు 35 గ్రామాల ప్రజలు ఆదోని, కర్నూలుకు వెళ్లాలంటే ఈ ఒక్క రోడ్డే శరణ్యం. గత టీడీపీ ప్రభుత్వంలో నూతన రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైతే ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఐదేళ్లు గుంతల రోడ్డుపై నరకయాతన తప్పలేదు. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి ఉంది. అయితే.. ధాణాపురం నుంచి హెబ్బటం వరకు 0/0 నుంచి 12.8 కి.మీ వరకు రోడ్డు నిర్మాణానికి రూ.7 కోట్లతో టెండర్లు కూడా పూర్తి చేశారు. హెబ్బటం నుంచి హొళగుంద వరకు 12/8 - 25/8 కి.మీల వరకు రూ.6.70 కోట్లతో ప్రతిపాదనలు ఆమోదం దశలో ఉన్నాయి.
- ఎమ్మిగనూరు-మాలపల్లి-కోసిగి రోడ్డు గత వైసీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, కోసిగి, కౌతాళం మండలాల్లోని సుమారుగా 45 గ్రామాల ప్రజలకే కాదు, ఎమ్మిగనూరు ప్రాంతం నుంచి ఉరుకుంద దేవస్థానికి వెళ్లే భక్తులకు ప్రధాన రోడ్డు ఇది. ప్రస్తుతం గుంతలతో అధ్వానంగా ఉంది. ఎమ్మిగనూరు నుంచి జలవాడి వరకు 0/0 - 10/8 కి.మీల వరకు నూతన రోడ్డు నిర్మాణానికి రూ.5 కోట్లతో టెండర్లు పూర్తి చేశారు. 10/8 నుంచి 12 కి.మీల వరకు రోడ్డు నిర్మాణానికి మరో రూ.2.40 కోట్లు అవసరమని ప్రతిపాదనలు పంపారు.
- కరివేముల క్రాస్ నుంచి అగ్రహారం వయా తెర్నేకలు ప్రధాన రోడ్డు 14 కి.మీలు అధ్వానంగా మారింది. నూతన రోడ్డు నిర్మాణానికి రూ.3.50 కోట్లతో టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. త్వరలో పనులు మొదలు పెట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు.
- గుత్తి-పత్తికొండ-ఆదోని రోడ్డు ప్రధాన రహదారి ఎర్రగుడి నుంచి జొన్నగిరి 9/0 నుంచి 17/8 కి.మీలు వరకు రోడ్డు నిర్మాణానికి రూ.5 కోట్లు మంజూరు చేశారు. ఇదే రోడ్డు పలు ప్రాంతాల్లో అధ్వానంగా ఉంది. శాశ్వత మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.
- ఆదోని మండలం బైచిగేరి క్రాస్ (ఏజీ రోడ్డు) నుంచి పెద్దకడుబూరు వయా కపటి రోడ్డు దశాబ్దన్నర కాలంగా మరమ్మతులకు నోచుకోలేదు. పూర్తిగా అధ్వానంగా మారింది. 0/0 నుంచి 13/5 కి.మీల వరకు పునర్నిర్మాణం కోసం రూ.6.4 కోట్లకు పంపిణీ ప్రతిపాదనలు ఆమోదం దశలో ఉన్నాయి. త్వరలోనే పనులు చేపడుతామని ఇంజనీర్లు పేర్కొన్నారు. అలాగే.. మదిరె-కాత్రికి, మాధవరం-తాండా రోడ్ల ఆధునికీకరణకు రూ.3.50 కోట్లతో టెండర్లు ప్రక్రియ పూర్తి చేశారు.
- కర్నూలు-బళ్లారి రోడ్డు ఆలూరు మండలం చిన్నహోతూరు, పెద్దహోతూరు దగ్గర అధ్వానంగా మారింది. శాశ్వత మరమ్మతుల కోసం 93/0 నుంచి 99/8 కి.మీల వరకు రూ.3.5 కోట్లతో టెండర్లు పిలిచారు. అలాగే.. కర్నూలు డివిజన్ పరిధిలోని కర్నూలు-కె.నాగులాపురం వరకు 8 నుంచి 9 కి.మీల మధ్య అధ్వానంగా తయారైంది. రూ.8 కోట్లతో శాశ్వత మరమ్మతులు చేపట్టనున్నారు.
- నన్నూరు-చిన్నటేకూరు ప్రధాన రోడ్డు నిర్మాణానికి రూ.8కోట్లు మంజూరు చేశారు. గుంతలమయంగా మారిన ఈ రోడ్డుకు మహర్దశ వచ్చిందని స్థానికులు పేర్కొంటున్నారు. అలాగే.. శకునాల-తిప్పయిపల్లి-బ్రహ్మణపల్లె రోడ్డు 9.6 కి.మీ నిర్మాణానికి రూ.3.56 కోట్లతో చేపట్టిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి.
- కోడుమూరు-ఎమ్మిగనూరు మధ్యలో నాలుగు గ్రామాల వద్ద రూ.3.50 కోట్లతో రెండు కి.మీలు సీసీ రోడ్డు, 4/0 నుంచి 18/0 కి.మీల వరకు రూ.2.50 కోట్లతో 5.7 కిలో మీటర్లు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. కర్నూలు డివిజన్ పరిధిలో దాదాపు రూ.29.15 కోట్లతో వివిధ పథకాలు కింద రోడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు.

రూ.107.23 కోట్లు మంజూరు

వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేపట్టింది. మిషన్ పాట్ హోల్ ఫ్రీ ఏపీ (గుంతలు రహిత రహదారుల మిషన్)లో భాగంగా 838.70 కిలో మీటర్ల రహదారులు శాశ్వత మరమ్మతుల కోసం 240 పనులకు రూ.19.87 కోట్లు మంజూరు చేశారు. త్వరలోనే పనులు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. అదే క్రమంలో నాబార్డు, ఎండీఆర్ ప్లాన్, అడిషనల్ ప్లాన్, ఎస్‌హెచ్ ప్లాన్, అడిషనల్ ప్లాన్ పథకాల కింద 26 రహదారులు, 191.53 కిలో మీటర్లు నూతన రోడ్డు నిర్మాణం కోసం రూ.87.36 కోట్లు మంజూరు చేశారు. నాబార్డు నిధులు రూ.18.81 కోట్లతో చేపట్టిన 47.62 కి.మీల ఏడు రోడ్ల నిర్మాణాల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. మిగిలిన పనులు టెండర్ల దశలో ఉన్నాయి. టెండర్ల ప్రక్రియ పూర్తి నిర్మాణాలు చేపడుతామని ఇంజనీర్లు తెలిపారు. అంతేకాకుండా రహదారుల నిర్వహణ కోసం మరో రూ.4 కోట్లు అవసరం ఉందని ప్రతిపాదనలు పంపించారు. పనులన్నీ పూర్తయ్యాక జిల్లా ప్రధాన రోడ్లు అందంగా తయారు అవుతాయని పలువురు పేర్కొంటున్నారు.



అసంపూర్తిగా ఆలూరు-చింతకుంట జాతీయ రహదారి పనులు



ఎమ్మిగనూరు - మాలపల్లి రోడ్డు దుస్థితి ఇది

రోడ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో ప్రధాన రహదారుల మరమ్మతులు, నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని పెట్టింది. 838.70 కి.మీ రోడ్లకు మరమ్మతులు చేపట్టాం. వివిధ పథకాలు కింద 26 రోడ్లు 191.53 కిమీ నిర్మాణానికి రూ.87.36 కోట్లు మంజూరు చేశారు. ఇప్పటికే ఏడు పనులు మొదలు పెట్టాం. 19 రోడ్ల పనులు టెండరు దశలో ఉన్నాయి.

- మహేశ్వరరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ

● జిల్లాలో ప్రధాన రోడ్లు మరమ్మతులు, నిర్మాణాలకు నిధులు మంజూరు, ప్రస్తుత పరిస్థితి (రూ.కోట్లల్లో):

పథకం	పనులు	నిధులు	కి.మీలు	ప్రస్తుత పరిస్థితి
నాబార్డు	7	18.81	47.62	వివిధ దశల్లో పనులు
ఎండీఆర్ ప్లాన్	5	12.90	38.91	టెండరు పిలిచారు
ఎస్‌హెచ్ ప్లాన్	7	18.50	30.70	టెండరు పిలిచారు
ఎండీఆర్ అడిషనల్ ప్లాన్	4	19.15	46.70	టెండర్లు పిలవాల్సి ఉంది
ఎస్‌హెచ్ అడిషనల్ ప్లాన్	3	18.00	27.60	టెండర్లు పిలవాల్సి ఉంది
మొత్తం	26	87.36	191.53	
మిషన్ పాట్‌హోల్ ఫ్రీ ఏపీ	240	19.87	838.70	పనులు జరుగుతున్నాయి
మొత్తం	**266**	**107.23**	**1,030.23**	

రక్తి కట్టని జగన్నాటకం

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో నిందితుడిగా సీబీఐ కోర్టుకు హాజరైన జగన్.. అనుచరులతో ఆడిన నాటకం రక్తి కట్టలేదని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 16 నెలలు జైలు జీవితం గడిపి బెయిల్‌పై బయటకు వచ్చిన వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి వ్యక్తిగతంగా కోర్టుకు హాజరు కాకుండా సాకులు చెబుతు ఇంత కాలం కోర్టు కళ్లు కప్పి తిరిగారన్నారు. ఎట్టకేలకు సీబీఐ కోర్టు ఆదేశాలతో కోర్టుకు హాజరుకావాల్సి వచ్చిందన్నారు. కోర్టు దృష్టిని మరల్చేందుకు వైసీపీ నాయకులు, కార్యకర్తలతో హైదరాబాద్‌లో రప్పా.. రప్పా డైలాగులతో ర్యాలీలు నిర్వహించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు వ్యవస్థలను జగన్ నాశనం చేశాడన్నారు. గత పాలనలో చేసిన అరాచక పాలనకు ప్రతి ఫలంగా ప్రజలు 151 సీట్ల నుంచి 11 సీట్లకే పరిమితం చేసినా జగన్‌కు జ్ఞానం రాలేదన్నారు. బలప్రదర్శనలు చేసి వ్యవస్థలను భయపెట్టాలనే ప్రయత్నాలను మానుకోవాలని హితవు పలికారు.

రుణాలు మంజూరు చేయండి

● కలెక్టర్ సిరి ● బ్యాంకర్లతో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఆదాయం పెరిగేలా పాడి పరిశ్రమ, అనుబంధ రంగాలకు బ్యాంకర్లు విరివిగా రుణాలు మంజూరు చేయాలని కలెక్టర్ సిరి బ్యాంకర్లను సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో బ్యాంకర్లకు సంబంధించిన రెండో త్రైమాసిక డీసీసీడీఎల్‌ఆర్‌సీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల జీవనోపాధిని బలోపేతం చేయడానికి ముఖ్యంగా లైవ్ స్టాక్ సంబంధిత రుణాలను విస్తృతంగా ఇవ్వాలని సూచించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ రామచంద్రరావు మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (ఎఫ్ఐ 2025-26) కర్నూలు జిల్లాకు వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.17,402.86కోట్లు కాగా 30.09.2025 నాటికి సాధన రూ.12,685.90 కోట్లు (72.90 శాతం) సాధించామన్నారు. కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ సుశాంత్ కుమార్, ఏపీజీబీ రీజనల్ మేనేజర్ నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ కింద రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలని కలెక్టర్ సిరి నెట్‌వర్క్ ఆసుపత్రి యాజమాన్యాలను సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్టీఆర్ వైద్యసేవకు సంబంధించి ప్రైవేటు నెట్ వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవ కింద రోగులకు ఉచితంగా వైద్యం అందించే పథకమని, రోగుల నుంచి డబ్బులు తీసుకోవడం సముచితం కాదన్నారు. ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

కలెక్టరేట్ ఎదుట మెప్మా ఆర్పీల ధర్నా

కర్నూలు న్యూసిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మెప్మా ఆర్పీలకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం మెప్మా ఆర్పీ ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షురాలు రుద్రమ అధ్యక్షతన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంజిబాబు మాట్లాడుతూ మహిళా మార్ట్ కోసం గ్రూపు సభ్యులు చెల్లించిన రూ.64 లక్షల గ్రూపు సభ్యులకు తిరిగి చెల్లించాలన్నారు. రాజకీయ నాయకులు జోక్యం నివారించాలన్నారు. హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఉమాదేవి, నగర కార్యదర్శి ఆర్.నరసింహులు, రియాజ్ బాషా, కోశాధికారి సుజాత, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న మెప్మా ఆర్పీలు

సాగునీరు అందించడమే లక్ష్యం

జీడీపీ కుడి కాలువకు నీరు విడుదల



చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే

గోనెగండ్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతాంగానికి సాగునీరు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం గాజులదిన్నె ప్రాజెక్టులోని నీటికి గంగ పూజ చేసి ప్రాజెక్టు కుడి కాలువ ద్వారా ఆయకట్టు రైతులకు ఎమ్మెల్యే బీవీ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రబీ సీజన్‌లో ఆయకట్టు రైతులకు సాగు నీరు విడుదల చేస్తున్నామని, ప్రాజెక్టులో 3 టీఎంసీ నీరు ఉన్నందుకు ప్రస్తుతం 13వేల ఎకరాలకు సాగునీరు విడుదల చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, ఈఈ పాండురంగయ్య, డీఈ సుబ్బరాయుడు, ఏఈ మహమ్మద్ ఆలీ, ఉగ్రనరసింహుడు, టీడీపీ నాయకులు తిరుపతయ్యనాయుడు, రామాంజినేయులు పాల్గొన్నారు.

రాయలసీమకు ఇక్కడి నుంచే చేప పిల్లల సరఫరా

గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి చేప పిల్లలను రాయలసీమలోని అన్ని జిల్లాలకు పంపిణీ చేసేలా చూస్తామని ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా మన చెరువు మన సీడ్ పథకం కింద గాజులదిన్నె ప్రాజెక్టులోని పాండ్స్‌లో మత్స్య కార్మికులు స్వంత ఖర్చులతో సిద్ధం చేసుకున్న 25లక్షల చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో మత్స్య శాఖాధికారి నాగరాజు, జిల్లా మత్స్య కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజినేయులు, పోతులశేఖర్, తహసీల్దార్ రాజేశ్వరి పాల్గొన్నారు.

పార్కు పరులపాలు..!



- వ్యాపార కేంద్రంగా కర్నూలు చిన్న పార్క్
- లీజుకు ఇచ్చిన నగరపాలక సంస్థ
- అడ్డగోలుగా గ్లో గార్డెన్‌లో దుకాణాల ఏర్పాటు
- గోడలు కూల్చి హోటల్ నిర్మాణం
- నిర్వాహకుల ఇష్టారాజ్యం
- అధికారుల తీరుపై సర్వత్రా అనుమానాలు

కర్నూలులో చిన్నపార్క్ ఒక ముఖ్యమైన కూడలి. ప్రజా జీవితంలో భాగం. దాన్ని అధికారులు టెండర్లు వేసి లీజుకు ఇచ్చారు. ప్రభుత్వమే వ్యాపారం చేయాలనుకున్నాక.. లీజుకు తీసుకున్న వాళ్లు వెనక్కి తగ్గుతారా? చిన్నపార్క్ ఇప్పుడొక వ్యాపార కేంద్రం. దాని రూపురేఖలే మారిపోయాయి. సొమ్ము సంపాదించుకోవడానికి చేయగల మార్పులన్నీ చేశారు. రూ.2.50 కోట్లతో అభివృద్ధి చేసిన నగరపాలక సంస్థ నెలకు రూ.64 వేలకు 2029 దాకా లీజుకు ఇచ్చి డబ్బు సంపాదించాలని అనుకుంది. లీజుకు తీసుకున్నవాళ్లు పార్క్‌ను ఇష్టానుసారంగా మార్చేసి అంతకంటే భారీ ఎత్తున వ్యాపారం చేస్తున్నారు.

కర్నూలు న్యూసిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని చిన్న పార్కును సుమారు రూ.2.50 కోట్లతో అభివృద్ధి చేశారు. అయితే దానిని గ్లో గార్డెన్ పేరుతో టెండరు ద్వారా నెలకు రూ.64 వేల అద్దెతో పాటు 18 శాతం జీఎస్టీ చొప్పున ఇతరులకు లీజుకు ఇచ్చారు. 01.02.2024 నుంచి 31.01.2029 వరకు 5 సంవత్సరాలు ఆర్. ప్రశాంతి టెండర్‌లో దక్కించుకున్నారు. దీంతో పాటు రూ.1,30,00,000కు డిపాజిట్ కూడా చేయించుకున్నారు. అంతేకాకుండా ఐదు సంవత్సరాల వరకు లీజు వర్తించే విధంగా అనుమతులు ఇచ్చారు. నగర పాలక నిబంధనల ప్రకారం లీజుకు తీసుకున్న వారు పార్కులో కొత్తగా ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. అయితే లీజుకు దక్కించుకున్న నిర్వాహకులు అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా పార్కులో అనేక నూతన కార్యక్రమాలు చేపట్టారు. ఇదంతా నగర పాలక కార్యాలయం కూతవేటు దూరంలో ఉన్నా అధికారులకు తెలియదని చెబుతున్నారు. దీంతో పార్కు అంతా సర్వనాశనమైంది. పచ్చదనం కరువైంది...పర్యవేక్షణ లేదు...పార్కులో సుమారు రూ.25 లక్షల చొప్పున చైనా నుంచి తీసుకువచ్చిన 3 లైటింగ్ చెట్లను తొలగించి దుకాణాలను ఏర్పాటు చేశారు. పార్కులో ఉన్న శిలాఫలకాన్ని తొలగించడంతో పాటు సుమారు రూ.8 లక్షలతో నిర్మించిన వాటర్ ఫౌంటెన్‌ను పూర్తిగా నిర్మూలించారు.

రూ.75 లక్షలు నష్టం...

చిన్న పార్కులో అభివృద్ధి కోసం చైనా నుంచి ఒక్కో చెట్టు సుమారు రూ.25 లక్షల చొప్పున 10 లైటింగ్ చెట్లను తెప్పించారు. వాటిని చైనా నుంచి నౌకద్వారా విశాఖపట్టణం హార్బర్‌కు అక్కడి నుంచి వాహనాల ద్వారా కర్నూలుకు రప్పించారు. అయితే నగర పాలక అధికారుల అనుమతి లేకుండా పార్కులో అక్రమంగా దుకాణాలు ఏర్పాటు చేసేందుకు సుమారు 3 లైటింగ్ చెట్లను తొలగించారు. వాటి విలువ రూ.75 లక్షలు ఉం టుంది. ఇలా తీసివేడం వల్ల పార్కులో ఆహ్లాదం కరువైంది. దీంతో పా టు దుకాణాలు ఏర్పాటు చేసిన చోట్ల నాలుగు పెద్ద పెద్ద చెట్లును తొలగించారు. పచ్చదనం కోసం ఏర్పాటు చేసిన సుమారు రూ.50 వేలు విలువ చేసే మొక్కలను తొలగించేశారు.

గోడను కూల్చేసి అక్రమంగా హోటల్ నిర్మాణం



పార్కు లోపల హోటల్ నిర్వహణ

చిన్నపార్కులో రెవెన్యూ విభాగం బహిరంగ వేలం నిర్వహించి రూ.1.24,35,000 లీజుకు ప్రైవేటు వ్యక్తికి అప్పగించింది. అయితే మూడు నెలల క్రితం దాని ప్రహరీని కూల్చేశారు. దర్శాగా షాపులు, టిఫిన్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. సదరు వ్యక్తులు మున్సిపల్ అధికారులకు మామూళ్లు ఇచ్చుకుని అనధికారికంగా వీటిని ఏర్పాటు చేసుకున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి అధికారులు అనుమతి లేకుండా, టెండర్ లేకుండా మున్సిపల్ ఆస్తులకు సంబంధించిన ప్రహరీని కూల్చడం నేరం. ఎవరికీ చెప్పకుండా కూల్చేయడం, దుకాణాలను ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు చేసుకోవడం మున్సిపల్, ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులకు పట్టలేదు. ఇదే అంశంపై ఆగస్టు 2న జరిగిన నగర పాలక సర్వసభ్య సమావేశంలో కార్పొరేటర్లు షేక్ అహ్మద్, జుబేర్, మున్సిపల్ అధికారుల అవినీతిపై ధ్వజమెత్తారు.

నిర్వాహకుల ఇష్టారాజ్యం... అడ్డగోలుగా వసూలు

లీజుకు దక్కించుకున్న నిర్వాహకులు ఇష్టారాజ్యంగా పార్కులో పెత్తనం చెలాయిస్తున్నారు. ప్రధానంగా పార్కు లోపలికి వెళ్లడానికి నగర పాలక అధికారుల నిబంధనల మేరకు రుసుము చెల్లించనవసరం లేదు. ఈ నిబంధనలకు విరుద్ధంగా నిర్వాహకులు ఎంట్రీ ఫీజు రూ.10 వసూలు చేస్తున్నారు. పార్క్‌లో నగర పాలక ఏర్పాటు చేసిన ర్యాకెట్, ఉయ్యాల నుంచి ఎంట్రీ ఫీజు రూ.30 వసూలు చేస్తున్నారు. నగర పాలక సంస్థకు చెల్లించే అద్దెకన్నా నిర్వాహకులు వసూలు చేసేది ఎక్కువగా ఉంది. పోనీ పార్కునైనా అందాంగా ఉంచారా? అంటే అదీ లేదు. పార్క్ అంతా మొక్కలు, రాళ్ళ, చెత్తకుప్పలతో నిండిపోయింది. పార్కులో ఏర్పాటు చేసిన కొన్ని విగ్రహాలు తుప్పుపట్టే దిశకు వచ్చినా కూడ అధికారులు పట్టించుకోవడం లేదు.

మిగతా 6వ పేజీలో

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం
క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించండి : డీఈఓ శామ్యూల్‌పాల్

నిరంతరం శ్రమించినా నిరాశే..!
పనులు చేసినా అందని బిల్లులు
ఎస్టిమేషన్లు పంపడంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

7

ఆయేషా.. ఆదర్శం..

- భిక్షాటన వదిలి కౌలు రైతుగా మారి
- బాలుడి నుంచి ట్రాన్స్‌జెండర్‌గా మారిన ఆయేషా
- పంటలతో పాటు పాడి, పశు అభివృద్ధిలో కృషి

హిజ్రాలంటేనే అదోరకంగా చూసే ప్రస్తుత సమాజంలో ఆయేషా ఆదర్శప్రాయంగా నిలిచింది. పాణ్యం గ్రామానికి 14ఏళ్ల క్రితం వచ్చిన షేక్ అబ్దుల్ మజీద్ ఉరఫ్ ఆయేషా సొంత గ్రామం పాములపాడు మండలం భానుముక్కల. ఈమె తల్లిదండ్రులు షేక్ ఫాతిమాబీ, షేక్ మౌలాలి. వీరికి ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె. అబ్దుల్ మజీద్(ఆయేషా) నాల్గవ సంతానం. ఐదవ తరగతి వరకు చదువుకున్న ఆయేషా మగ పిల్లవాడిగా పుట్టి పొలం పనులకు వెళ్తూ తల్లిదండ్రులకు వ్యవసాయంలో చేదోడు, వాదోడుగా ఉండేవాడు. హార్మోన్స్ లోపం కారణంగా ఆడపిల్ల లక్షణాలు వచ్చాయి. ఆయేషా ఆడపిల్లలతో కలిసి తిరగడంతో తల్లిదండ్రులు అవమానంగా భావిస్తుండడంతో 14 యేళ్ల క్రితం పాణ్యంకు వచ్చి హిజ్రాల బృందంలో చేరింది.

-పాణ్యం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి):

వరి సాగులో కలుపు తీస్తున్న ఆయేషా



పేరు మార్చుకొని హిజ్రాగా మారి...

పాణ్యంకు వచ్చిన షేక్ అబ్దుల్ మజీద్ హిజ్రాగా మారి ఆయేషాగా పేరు మార్చుకొని భిక్షాటనతో జీవనాన్ని గడుపుతుండేవాడు. కొన్నేళ్ల తర్వాత భిక్షాటన వదలి కౌలు రైతుగా మారింది. ఎకరా రూ. 25వేలు చెల్లిస్తూ రెండెకరాలలో వరి సాగు చేస్తోంది. మహానంది మండలం గంగవరంలో ఎకరా కౌలు తీసుకొని మొక్కజొన్న పంటను సాగు చేస్తుంది. పంటల సాగుతోపాటు పాడి అభివృద్ధికి కృషి చేస్తోంది. రెండు బర్రెలు, ఆరు ఆవులు పెంచుతోంది. వీటి పశుగ్రాసం కోసం 25 సెంట్ల స్థలంలో కోత్రి గడ్డిని (ఫారం గడ్డి) పెంచి పశువులకు అందిస్తుంది. అటు పాడి, ఇటు పంటలను పండిస్తూ గ్రామంలో రైతుగా నిలదొక్కుకుంది. సాగుబడిలో పంటకు పెట్టుబడులు, మందులు, కోతలు, అమ్మకాలు ఒక్కతే చేసుకోవడం గర్వించదగ్గ విషయం.

ఎకరాకు 40 బస్తాలు : ఎకరాకు 40 బస్తాల వరి దిగుబడి సాధిస్తున్నట్లు ఆయేషా పేర్కొంది. ఒక్కోసారి దొంగలు పడి తమ పంటను రాత్రివేళల్లో కోసుకువెళ్లడం, పందులదాడులతో నష్టపోతుంటానని ఆవేదన వ్యక్తం చేసింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పంట దెబ్బ తినే పరిస్థితి ఏర్పడినట్లు పేర్కొంది.



పశువులను సంరక్షిస్తున్న ఆయేషా

ఆమె మాటలే జీవితాన్ని మార్చివేశాయి : ఆయేషా



తొమ్మిదేళ్ల క్రితం పాణ్యం రహదారిపై భిక్షాటన చేస్తూ ఓ కారును ఆపి డబ్బులు అడిగాను. కారులో ఒకావిడ నన్ను పిలిచి నీవు తల్లిగర్భంలో నుంచి మగ పిల్లవాడిగా పుట్టావు, నీ తల్లిదండ్రులు నీకు కండలు, రక్తాన్ని పంచారు. దేవుడు జన్మనిచ్చాడు. హార్మోన్ల లోపంతో మారిన నీవు జీవించడానికి నీకు ఏమి లోపమని అడుక్కుంటున్నావని, మీరు బలవంతంగా తీసుకునే డబ్బు ప్రయాణికులు ఏ అవసరంలో వెళ్తున్నారో ఆలోచిస్తున్నారా అని ప్రశ్నించిందని పేర్కొంది. వారిని ఆపి డబ్బు డిమాండ్ చేయడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించిన మాటలు నా మనసును తీవ్రంగా చలింపజేశాయి. భిక్షాటన వదలి పొలం కూలీపనులకు వెళ్లేదాని. వ్యవసాయ పనుల్లో మంచి నైపుణ్యం లభించడంతో పాటు పంటల సాగుకు ధైర్యం లభించింది. అనాథలకు, మాలాధారులకు తన వంతు సహకారమందిస్తూ సామాజిక సేవలో ఉడతాభక్తితో సేవలందిస్తోంది. ఆయేషా ఒక హిజ్రాగా కాకుండా కౌలు రైతుగా మారి సాగిస్తున్న జీవన స్థితిగతులను మిగిలిన హిజ్రాలు గమనించాలని భిక్షాటనే ధ్యేయంగా జీవించే హిజ్రాలు ఆయేషాను ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక గ్రామ ప్రజలు కోరుతున్నారు.

స్నాతకోత్సవం విజయవంతం

సమన్వయంతో పని చేసిన ఉద్యోగులకు అభినందనలు

- ఉపకులపతి వి. వెంకట బసవరావు



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ

కర్నూలు అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆర్‌యూ 4వ స్నాతకోత్సవం సమన్వయంతోనే విజయవంతం చేయగలిగామని ఉపకులపతి వి. వెంకట బసవరావు అన్నారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలోని సెనేట్ హాలులో బోధన, బోధనేతర ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ ఈనెల 12న వర్శిటీలోని కాన్వకేషన్‌కు గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక వల్ల ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నదని అన్నారు. ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా పని చేయడంతో కార్యక్రమం విజయవంతమైందని ఉద్యోగులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఎన్‌టీకే నాయక్, రిజిస్ట్రార్ విజయ కుమార్, ప్రిన్సిపాల్ సీవీ కృష్ణారెడ్డి, డీన్ సుందరానందపుచ్చా, విశ్వనాథరెడ్డి, భరత్, పరీక్షల విభాగం కంట్రోలర్ ఎస్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

8 మంది విద్యార్థులు డీబార్

కర్నూలు అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 3వ సెమిస్టర్ పరీక్షల్లో 8 మంది విద్యార్థులు డిబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 52 పరీక్ష కేంద్రాల్లో 9,463 మంది పరీక్షల కోసం దరఖాస్తు చేయగా 8,611 మంది పరీక్షలు రాశారని తెలిపారు. పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన విద్యార్థులను డిబార్ చేశామని తెలిపారు.

ఆన్‌లైన్ భద్రతపై జాగ్రత్త వహించాలి

జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి



ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి

కర్నూలు లీగల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో బాలలు ఆన్‌లైన్‌లో దోపిడీకి గురి కాకుండా జాగ్రత్త వహించాలని జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ధి కోరారు. చిల్డ్రన్స్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో శుక్రవారం న్యాయ సేవా సదన్ భవనంలో సైబర్ క్రైంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ పిల్లల ఆన్‌లైన్ భద్రతా విధానాలు, సైబర్ క్రైమ్స్‌ను అడ్డుకోవడంపై సంబంధిత అధికారులు అవగాహన పెంచుకోవాలని ఆయన కోరారు. ప్రస్తుత సమాజంలో ఆన్‌లైన్ వేదికలో పిల్లలు అనేక రకాలుగా దోపిడీలకు గురవుతున్నారన్నారు. వాటిని ఎదుర్కొని పిల్లలను రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సైబర్ క్రైం సీఐ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో పలు మోసాలు జరుగుతున్నాయనీ, ఈ మోసాలలో పిల్లలు నష్టపోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. బెంగుళూరు చెందిన సీనియర్ ప్రోగ్రాం ఆఫీసర్ శుభ్రత్ కుమార్ పిల్లలపై ఆన్‌లైన్‌లో జరిగే దోపిడీలు, వాటిని ఎదుర్కొనే విధానాల గురించి సంబంధిత అధికారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం.వెంకట హరినాథ్, కర్నూలు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు హరినాథ్ చౌదరి, ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన సీడీపీవోలు, డీసీపీవోలు, సీడబ్లూసీ చైర్మన్ జుబేదా బేగం, కర్నూలు ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, దిశా పీఎస్ సీఐ రామనాయుడు తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి 'మీ కోసం రైతన్న'




మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న మీకోసం రైతన్న కార్యక్రమాన్ని ఈనెల 24వ తేదీ నుంచి ప్రారంభించనున్నట్లు కలెక్టర్ రాజకుమారి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల సాగు, అగ్రిటెక్ సాంకేతికతల వినియోగం వంటి కీలక అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల్లో రైతులను ప్రత్యక్షంగా కలిసి రోజుకు 30మంది రైతులకు పథకాలను వివరించి రైతుల ఫొటోలను యాప్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. ఈనెల 24 వ తేదీ నుంచి 29 వరకు కొనసాగి అనంతరం రైతుల సమస్యలను సేకరించి డిసెంబర్ 3న రైతు సేవా కేంద్రాల్లో వర్క్‌షాపు నిర్వహిస్తామన్నారు.

దేవుడి సొమ్ము సొంతానికి

- కోటి దీపోత్సవ విరాళాలు సొంత ఖాతాలోకి మళ్లించుకున్న ఉద్యోగి
- 15 ఏళ్లుగా నిర్వాకం



మహానంది, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆయన దేవదాయశాఖలో ఓ ఉద్యోగి. దేవాలయ అభివృద్ధికి పాటుపడాలి. కానీ ఈయన ఒక ముఠాను తయారు చేసుకొని దాతల నుంచి వచ్చే ఆర్థిక వనరులను స్వాహా చేస్తున్నాడు. ఇది ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి వెళ్లినట్లు సమాచారం.

అనంతపురం జిల్లా గుత్తికి చెందిన ఒక భక్తుడు మహానందీశ్వరస్వామి వారికి కార్తీక పౌర్ణమి రోజు నిర్వహించే కోటి దీపోత్సవానికి, జ్వాలా తోరణానికి అవసరమైన 20 లీటర్ల నూనెకు అవసరమైన డబ్బును 15 సంవత్సరాలుగా అందిస్తున్నారు. ఆలయానికి చెందిన ఓ ఉద్యోగి ఎవ్వరికి తెలియకుండా దాత ఇస్తున్న విరాళాన్ని సొంత ఖాతాలోకి మళ్లించుకుంటున్నాడు. ఈ వ్యవహార 15 సంవత్సరాలుగా జరుగుతున్నది. ఇటీవల క్షేత్రంలో జరిగిన కోటి దీపోత్సవం సందర్భంగా వెలుగులోకి వచ్చింది. క్షేత్రానికి వచ్చే దాతలు ఈయన మాటలు నమ్మి ఇస్తున్న మిగతా విరాళాలు కూడా దారి మళ్లుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఉద్యోగితో పాటు మహానంది దేవస్థానంలో ప్రస్తుతం విధులు నిర్వహించే మరో ఉద్యోగి పాత్ర కూడా ఉన్నట్లు సమాచారం.

విచారించి చర్యలు తీసుకుంటాం

మహానంది క్షేత్రంలో కోటి దీపోత్సవం నిర్వహణ పేరుతో దాత నుంచి ఓ ఉద్యోగి కొన్ని సంవత్సరాలుగా వసూళ్లకు పాల్పడ్డటట్లు తెలుస్తోంది. ఇది రుజువైతే శాఖ పరంగా చర్యలు తీసుకుంటాం. సహ ఉద్యోగుల పాత్ర ఉందనే అంశంపై కూడా విచారిస్తున్నాం.

-శ్రీనివాసరెడ్డి, ఆలయ ఈవో

పార్కు పరులపాలు!

(5వ పేజీ తరువాయి)

గ్లో గార్డెన్‌ను అందంగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో అధికారులు ఇతర ప్రాంతాల నుంచి రకరకాల పక్షుల బొమ్మలను లైటింగ్‌తో ఏర్పాటు చేశారు. అందులో కొన్ని శిథిలావస్థకు చేరాయి. పార్కులో రూ.8 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటేన్‌ను పూర్తిగా తొలగించారు. కరెంటు బిల్లు ఎక్కువగా వస్తుందని ఈ పని చేశారు. ఆ స్థానంలో మరో దుకాణం ఏర్పాటు చేయడానికి నిర్వాహకులు ప్రయత్నిస్తున్నారు. పార్కులో చిరు వ్యాపారుల దుకాణాలను రాష్ట్ర మంత్రి టీజీ భరత్ ప్రారంభించడం చర్చనీయాంశమైంది.



నోటీసు జారీ చేసిన స్పందన కరువు...

ఆగస్టులో కౌన్సిల్‌లో జరిగిన చర్చకు నగర పాలక అధికారులు గత నెల 10న పార్క్ నిర్వాహకురాలు ప్రశాంతికి నోటీసులు జారీ చేశారు. ఇందులో నిబంధనలు అతిక్రమించి నిర్మాణాలు చేపట్టారని...గ్లో గార్డెన్ నాణ్యతను దెబ్బతీయడంతో పాటు పార్కు గోడను కూల్చి అదనంగా మరో గేటు ఏ విధంగా ఏర్పాటు చేస్తారని నోటీసులో పేర్కొన్నారు. దీని మీద మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని, లేని పక్షంలో లీజు రద్దు చేయడంతో పాటు సంబంధిత నిర్వాహకురాలిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు. అయితే అదే నెల 16న నిర్వాహకురాలు వివరణ ఇస్తూ నగర పాలక కార్యాలయానికి పంపింది. అందులో ఓ ప్రజాప్రతినిధి అనుమతితోనే దుకాణాలు ఏర్పాటు చేసుకున్నామని... కమిషనర్ ఆదేశాల మేరకు గోడను కూల్చి అదనంగా గేటు ఏర్పాటు చేసుకున్నామని వివరణ ఇచ్చారు. లీజు పూర్తి అయిన వెంటనే పార్కులో ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించేందుకు తాను సిద్ధమని ఈ వివరణ వచ్చి నెల రోజులు అవుతున్నా అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

నోటీసు జారీ చేశాం తగిన చర్యలు తీసుకుంటాం



గ్లో గార్డెన్ లీజుకు తీసుకున్న నిర్వాహకురాలికి నోటీసు జారీ చేశాం. ఆమె ఇచ్చిన వివరణ మాకు సమ్మతంగా లేకుంటే తగిన చర్యలు తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నాం. పార్కులో నగర పాలక సంస్థ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన పరికరాలు..చెట్లు.. ధ్వంసం చేసినట్లు విచారణలో వెల్లడైతే...ఆమెతోనే ఆ పనులు తిరిగి పూర్తి చేయించేందుకు సిద్ధంగా ఉన్నాం. నిబంధనలు అతిక్రమిస్తే ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదు.

- పి.విశ్వనాథ్, నగర పాలక కమిషనర్

కమిషనర్ అనుమతితోనే గోడ కూల్చివేత

నగర పాలక కమిషనర్ అనుమతితోనే పార్కు గోడను కూల్చాము. ఓ ప్రజాప్రతినిధి అనుమతితోనే దుకాణాలను ఏర్పాటు చేశాము. లీజు పీరియడ్ అయిన వెంటనే దుకాణాలను తొలగిస్తామని నగర పాలక అధికారులకు ఓ అఫిడవిట్ దాఖలు చేశాను. ప్రజాప్రతినిధి, అధికారులు ఎలాంటి పత్రాలు ఇవ్వలేదు. కేవలం నోటి మాటగా చెప్పారు.

- ఆర్.ప్రశాంతి, గ్లో గార్డెన్ నిర్వాహకురాలు



ఇప్పుడు గోడ పక్కనే దుకాణాల ఏర్పాటు

పత్తి కొనుగోలు కేంద్రాల పరిశీలన

ఎమ్మిగనూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరులో ఏర్పాటు చేసిన నాలుగు సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను శుక్రవారం జాయింట్ కలెక్టర్ నూరల్ కమర్ పరిశీలించారు. ఆయా జిన్నింగ్ ఫ్యాక్టరీల దగ్గర పత్తి విక్రయించేందుకు వచ్చిన రైతులు ప్రస్తుతం పత్తి కొంత మేరే కొనుగోలు చేస్తున్నారని.. ఎక్కువ క్వింటాళ్ల కొనుగోలు చేయాలని కోరారు. అలాగే స్లాట్ బుకింగ్ సమస్యగా ఉందని, దీన్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన జేసీ సీసీఐ అధికారులతో మాట్లాడారు. వారు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. రెండు మూడు రోజుల్లో రెండోకోత, మూడో కోత పత్తిని కొనుగోలు చేసుందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు ప్రత్యేకశ్రేణి కార్యదర్శి చంద్రమౌళి, తహసీల్దార్ శేషఫణి, ఏఓ శివశంకర్, జిన్నింగ్ ఫ్యాక్టరీ నిర్వాహకులు మురారి రెడ్డి, మహాబలేశ్వర్, నటరాజ్, సిబ్బంది ఉన్నారు.



జిన్నింగ్ మిల్లులో పత్తిని పరిశీలిస్తున్న జేసీ

పత్తి ఓబులయ్య సేవలు అనిర్వచనీయం

'కమల కళానికేతన్' వ్యవస్థాపక అధ్యక్షుడు ఈరన్న



కళారత్న పత్తి ఓబులయ్యను సత్కరిస్తున్న కవి సవ్వప్పగారి ఈరన్న

కర్నూలు కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కళారంగానికి టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు, నంది అవార్డు గ్రహీత, కళారత్న పత్తి ఓబులయ్య అందిస్తున్న సేవలు అనిర్వచనీయమని కమల కళానికేతన్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, కవి సవ్వప్పగారి ఈరన్న అన్నారు. శుక్రవారం టీజీవీ కళాక్షేత్రంలో ఇటీవల తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ జీవన సాఫల్య పురస్కారం అందుకున్న పత్తి ఓబులయ్యకు పూలదండవేసి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఈరన్న మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఏడు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించి, వాటిని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదుకు కృషి చేశారని ప్రశంసించారు. ఈఏడాదిలో వరుసగా మూడు పర్యాయాలు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కళాక్షేత్రం పేరు చేర్చడంతో పాటు, కళాకారులందరికీ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రశంసాపత్రాలు అందించేలా శ్రమించారన్నారు. కార్యక్రమంలో కళాక్షేత్రం సభ్యులు కేవీ రమణ, డాక్టర్ కదిరి రమేష్, ముద్రిక భాస్కర్, రామ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంత్యుత్సవాలు



బాబాకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని నెహ్రూనగర్‌లోగల సత్యసాయి మందిరంలో పుట్టపర్తి సత్యసాయి బాబా జయంత్యుత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఈనెల 23న సత్యసాయి బాబా వారి శతవర్ష జన్మదినం సందర్భంగా మందిరాన్ని ప్రత్యేక విద్యుత్ దీపాలతో అలంకరించారు. శుక్రవారం ఆరో రోజు సత్యసాయి యువజన విభాగం ఆధ్వర్యంలో, ఉదయం నిత్య పూజల అనంతరం నగర శివారు దూపాడులోని గో సంరక్షణశాలలో ప్రత్యేక సేవా కార్యక్రమాలు చేపట్టారు. గోశాలలో సామూహిక సత్యసాయి భజనలు, వెయ్యి గోవులకు ఆహారం పెట్టే కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాయంత్రం మందిరంలో సత్యసాయికి పల్లకీ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా సత్యసాయి సేవా కమిటి కన్వీనర్ మాకా అశోక్‌కుమార్, యువజన విభాగం జిల్లా సమన్వయ కర్త సందీప్, జిల్లా మహిళా యువజన విభాగం సమన్వయకర్త గీత, ఇతర ప్రతినిధులు మాలతి, రామ్‌మోహన్, సూర్యనారాయణ, సాయిబాబా, డాక్టర్ పార్వతి, సరోజ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలు కల్యాణికి 'జాతీయ అవార్డు'




ఉపాధ్యాయురాలు కల్యాణికి జాతీయ అవార్డు అందిస్తున్న నిర్వాహకులు

పత్తికొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు కల్యాణికి మరో గౌరవ అవార్డు వరించింది. హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సంస్థ నిర్వాహకులు జాతీయస్థాయి ఉత్తమ అవార్డు అందజేశారు. శుక్రవారం కడప జిల్లా గండికోటలో హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ తాల్లూరి ప్రసన్న కుమారి చేతుల మీదుగా కల్యాణి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జేఎం తండా గ్రామంలో మూతపడి ఉన్న పాఠశాలను 55 మంది విద్యార్థుల స్థాయికి తీసుకురావడంలో టీచర్ కల్యాణమ్మ చేసిన కృషి అభినందనీయమన్నారు. అంతేకాకుండా అత్యాధునికి భోజనాలతో చిన్నారులను నవోదయ, గురుకులాలకు ఉత్తీర్ణత సాధించడంలో ఆమెచేసిన కృషి అమోఘమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరంతరం శ్రమించినా నిరాశే..!

● పనులు చేసినా అందని బిల్లులు
● మోదీ సభ కోసం అహర్నిశలు కష్టపడ్డ కాంట్రాక్టర్లు
● ఎస్టిమేషన్లు పంపడంలో విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం



కర్నూలు టౌన్ డివిజన్ కార్యాలయం బోర్డు

కల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అక్టోబరు 16న కర్నూలులో ప్రధాని మోదీ సభను విజయవంతం చేసేందుకు శ్రమించిన కాంట్రాక్టర్లకు నిరాశే మిగిలింది. అక్టోబరు 6న విద్యుత్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాలందుకున్న కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరుకు చెందిన కాంట్రాక్టర్లు 7వ తేదీ నుంచి నిద్రాహారాలు లేకుండా లేబర్‌ను సమీకరించుకుని నిర్దేశించిన పనులను సకాలంలో పూర్తి చేశారు. ప్రధాని సభ కావడంతో 12 పార్కింగ్ స్థలాల్లో కాంట్రాక్టర్లు పోల్స్, విద్యుత్‌లైన్లు, విద్యుదీకరణ పనులు చేశారు. కాంట్రాక్టర్ ద్వారా వెయ్యికి పైగా విద్యుత్ స్తంభాలు, 17 జనరేటర్లు, అలాగే 31 కిలోమీటర్ల కండక్టర్, అలాగే 24-160 కేవీ, 4-315 కేవీ, 4-100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు, 41కిలోమీటర్ల కేబుల్‌తో పాటు సంబంధిత ఐరన్ మెటీరియల్ స్టోర్స్ నుంచి అధికారులు డ్రా చేశామని తెలిపారు. పనులు చేసి రెండు నెలలు గడుస్తున్నా బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడ్వాన్సు కూడా ఇవ్వలేదని జేసీబీలు, లేబర్‌కు ఇవ్వాల్సిన బిల్లులు ఆలస్యం కావడంతో ఇబ్బందులు తప్పడం లేదని నిరాశతో బిల్లులు కోసం ఎదురు చూపులు తప్పడం లేదంటున్నారు.

ఎస్టిమేషన్ వేయడంలో నిర్లక్ష్యం

ప్రధాని సభకు విద్యుత్ శాఖ తరపున చేసిన పనులకు ఎస్టిమేషన్లు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపడంలో కర్నూలు డివిజన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. 12 పార్కింగ్ ఏరియాల్లో పనులు చేసేందుకు 12 మంది అధికారుల ద్వారా కాంట్రాక్టర్లతో పని చేయించారని వాటిని స్కెచ్ రూపంలో డివిజన్ అధికారులకు అప్పుడే అందించారని వివరించారు. పర్సంటేజీల కోసమే అధికారులు అక్టోబరు 24వ తేదీ వరకు ఎస్టిమేషన్లు డిస్కంకు పంపలేదని విమర్శించారు. అది కాకుండా సభ పూర్తైన అనంతరం విద్యుత్‌శాఖ అధికారులు మెటీరియల్ నుంచి డిస్‌మ్యాండిల్ (తొలగించి) చేసి స్టోర్స్ తరలించాలి. అక్రమంలో 30శాతం మెటీరియల్ పాడైపోయిందని ఎస్టిమేషన్ అధికారులు పంపి నట్లు తెలిసింది. ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ వారం రోజుల్లో 30శాతం విద్యుత్ మెటీరియల్ ఎలా పాడవుతుందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి ఎస్టిమేషన్ మార్చేలా వెనక్కి పంపినట్లు విశ్వసనీయ సమాచారం. నవంబరు నెల పూర్తవుతున్నా బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్లకు ఎదురుచూపులు తప్పడం లేదు.

ఎస్టిమేషన్లు సీఎండీకి పంపాం

బిల్లుల మంజూరు అంశంపై కర్నూలు టౌన్ డివిజన్ ఈఈ శేషాద్రి, రూరల్స్ ఏడీఈ సుబ్బన్నను సంప్రదించగా ప్రధాని సభ పనుల బిల్లులు ఎస్టిమేషన్స్ తయారు చేసి అక్టోబరు 22న సీఎండీ అనుమతి కోసం పంపామని వివరించారు. పీఎం సభకు డ్రా చేసిన మెటీరియల్ అంతా రిటన్ చేశామని స్పష్టంచేశారు. 12 పార్కింగ్ ఏరియాల్లో పనిచేసిన వర్క్ ఆర్డర్స్ ఎస్టిమేషన్ రూ.1.76 కోట్ల బిల్లు మంజూరు కోసం పంపామన్నారు. సీఎండీ ఎస్టిమేషన్ డెవల్యూషన్ చెక్ కోసం రిజాయిండర్ పంపగా అభ్యంతరాలు పరిశీలించి మరలా ఉన్నతాధికారులకు పంపామన్నారు. త్వరలో బిల్లులు మంజూరవుతా యన్నారు. మెటీరియల్ డిస్‌మాండిల్ చేసే క్రమంలో 1 లేదా 2 పర్సెంట్ పాడ యినట్లు ఏడీఈ తెలిపారు. మోదీ సభకు ఉపయోగించిన 16జనరేటర్లకు అడ్వాన్స్ కింద రూ.14.90 లక్షలు చెల్లించినట్లు ఆయన సూచించారు.

కొంత మెటీరియల్ రిటర్న్ చేయాల్సి ఉంది

జిల్లా స్టోర్స్ సెంటర్ నుంచి అధికారులు డ్రా చేసుకున్న విద్యుత్ సామగ్రి కొంత రిటర్న్ చేయాల్సి ఉందని స్టోర్స్ ఏడీఈ గురుదివాకర్ రెడ్డి తెలిపారు. ఈ అంశంపై స్టోర్స్ ఏడీఈని సంప్రదించగా కన్‌డక్టర్-31 కిమీ డ్రా చేయగా, 11 కిమీ వెనక్కి ఇచ్చారని, ట్రాన్స్‌ఫార్మర్లు 160 కేవీ -24 డ్రాచేసి 20 మాత్రమే రిటన్ చేశారని 4 ట్రాన్స్‌ఫార్మర్లు పెండింగ్ ఉన్నాయన్నారు. 315 కేవీ-4, 100 కేవీ-4 తీసుకుని వాటిని రిటన్ చేశారన్నారు. కేబుల్ 41కిలోమీటరు డ్రా చేసుకుని ఐరన్ మెటీరియల్ కొన్ని ఇవ్వాల్సి ఉందన్నారు.

మొదట అలా...తర్వాత ఇలా

కర్నూలు రూరల్స్ ఏడీఈ సుబ్బన్న మొదట మోదీ సభకు తీసుకున్న మెటీరియల్ అంతా రిటన్ చేశామని తెలిపారు. స్టోర్స్ ఏడీఈతో సమాచారం తీసుకున్న తర్వాత నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు రాగమయూరి వెంచర్‌లో రెగ్యులరైజ్ చేయాల్సి ఉందని, అవి పెండింగ్ ఉన్నాయని తెలుపడం గమనార్హం. నవంబరు 5న వాటికోసం ఎస్టిమేషన్ తయారుచేసి ఎస్ఈ అనుమతి కోసం ఫైల్ పం పామన్నారు. ఎస్టిమేషన్ మంజూరు కాగానే అక్కడ 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు రెగ్యులరైజ్ చేసి, 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు స్టోర్స్‌లో అందజేస్తామని ఓర్వకల్లు ఏఈ సునీల్‌కుమార్ తెలిపారు.

రిజిస్ట్రార్‌ను తొలగించాలి

● అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆర్‌యూ విద్యార్థుల నిరసన


ఆర్‌యూలో అర్ధనగ్న ప్రదర్శనతో విద్యార్థుల నిరసన

కర్నూలు అర్బన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బీఈడీ కళాశాలల అవినీతి, అక్రమాలకు వత్తాసు పలుకుతున్న ఆర్‌యూ రిజిస్ట్రార్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం రాయలసీమ యూనివర్సిటీలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. శరత్ కుమార్, ఏఐఎస్ఏ రాష్ట్ర కార్యదర్శి నాగార్జున, ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో అర్ధనగ్నంగా, మోకాళ్లపై వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్సిటీకి అనుబంధంగా ఉన్న బీఈడీ కళాశాలలు అవినీతి, అక్రమాలకు కేంద్ర బిందువుగా మారాయని అన్నారు. రిజిస్ట్రార్ బీఈడీ కళాశాలల యాజమాన్యాలతో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకుని, బీఈడీ కళాశాలల దందాకు అండదండలు అందిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో నాయకులు అలీ, భూపాల్, బాలాజీ, మునీంద్ర, మధు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

● ముగ్గురి అరెస్టు

పాణ్యం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పాణ్యం స్టీల్ ప్లాంట్ వద్ద శుక్రవారం రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కిరణ్‌కుమార్ రెడ్డి తెలిపారు. గంజాయి తీసికెళుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండుకు తరలించామన్నారు. ఈ మేరకు సీఐ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్ ప్లాంటు వద్ద గంజాయి అమ్ముతున్నారన్న సమాచారంతో దాడి చేశామన్నారు. వారి నుంచి రెండు కిలోల గంజాయి, మూడు సెల్ ఫోన్లు, పల్సర్ మోటారు సైకిల్ స్వాధీనం చేసుకున్నామన్నారు. అరెస్టు అయిన వారిలో చాగలమర్రికి చెందిన ముల్లువసీం అక్రం, చాగలమర్రి గడ్డం వీధికి చెందిన లంకా అలెగ్జాండర్, బనగానపల్లె ఈద్గా నగర్‌కు చెందిన బూరుగుల మనోహర్ ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి, పీఎస్ఐ ధనుంజయ, పాణ్యం పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు బాలికలు అదృశ్యం

కొలిమిగుండ్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొలిమిగుండ్లలోని నాయునిపల్లె రహదారిలో అక్కదేవత గుడి వద్దకు వచ్చిన ఇద్దరు బాలికలు అదృశ్యమైనట్లు సీఐ రమేష్‌బాబు శుక్రవారం తెలిపారు. వివరాలు.. అవుకు గ్రామానికి చెందిన దంపతులు తమ 15, 17 ఏళ్ల ఇద్దరు కూతుళ్లతో కలిసి పూజల నిమిత్తం అక్కదేవతల గుడి వద్దకు వచ్చారు. గురువారం రాత్రికి బయటికి వెళ్లివస్తామని చెప్పిన బాలికలు తిరిగి రాకపోవడంతో ఎక్కడ వెతికినా కనిపించలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కోవెలకుంట్లకు చెందిన బాలిక..

కోవెలకుంట్ల : మైనరు బాలిక అదృశ్యం కాగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి శుక్రవారం తెలిపారు. వివరాలు.. కోవెలకుంట్ల పట్టణానికి చెందిన మైనరు బాలిక పదో తరగతి చదువుతుంది. ఆమె ఎక్కువగా సెల్‌ఫోన్ చూస్తుం డడంతో తల్లిదండ్రులు మందలించగా మనస్తాపానికి గురై గురువారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో బంధువులు వద్ద ఆచూకీ వెతికినా సమాచారం లభించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ఎంపీ అధ్యక్షతన దిశ (డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంటు కోఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కలెక్టర్ సిరి, రాష్ట్ర, జిల్లాస్థాయి దిశా కమిటీ సభ్యులు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భగా ఎంపీ, దిశా ఛైర్మన్ మాట్లాడుతూ దేవ నకొండ, ఆస్పరి, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ మండలాలు కూరగాయల మీద ఆధార పడిన మండలాలు అని, సంబంధిత ప్రాంతాల్లో రూరల్ హాట్‌లను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ సిరి మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం పథకాల అమలుకు సంబంధించి ఎంపీ నిర్దేశించిన విధంగా ప్రతిపాదనలు రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ప్రసూతి మరణాలు జరగకూడదు

జిల్లాలో ప్రసూతి మరణాలు సంభవించకుండా ప్రతి గర్భిణీకి సకాలంలో వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సిరి వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ప్రసూతి మరణాలకు సం బంధించి జిల్లాస్థాయి కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులకు 8, 9 నెలల్లో ప్రతి వారం వైద్యపరీక్షలు నిర్వహించాలన్నారు. డీఎంహెచ్‌వో డా.భాస్కర్ రాజు, డీసీహెచ్ఎస్ డా.జఫ్రుల్లా, ఐసీడీఎస్ పీడీ విజయ పాల్గొన్నారు.

చిన్నారులను చేరదీసిన పోలీసులు

కర్నూలు క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇల్లు విడిచి వెళ్లిపోయిన ఇద్దరు చిన్నారులను సమాచారం తెలిసిన వెంటనే రైల్వే పోలీసులు వారి ఆచూకీ కనుగొని సురక్షితంగా చేరదీశారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఇద్దరు బాలురు ఆకాష్, ప్రశాంత్ బెంగళూరు, కర్ణాటక రాష్ట్రంలోని బిలాల్ మస్జీద్ రోడ్డు గుల్షన్ ఫంక్షన్ హాలు పక్కన, బొమ్మనహల్లి ఇంటి నుంచి వెళ్లిపోయారు. సమాచారం తెలుసుకున్న కర్నూలు రైల్వే పోలీసులు సీఐ శ్రీనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు అప్రమత్తమయ్యారు. కానిస్టేబుల్ విజయ కుమార్ అన్ని రైల్వేస్టేషన్లలో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సాయంత్రం 6 గంటలకు ఆ ఇద్దరు బాలురు నంద్యాలలో ఉన్నట్లు మహిళా ఎస్ఐ కుమారి, కానిస్టేబుల్ నరేంద్రలు గుర్తించారు. ఆ ఇద్దరు బాలురును సురక్షితంగా చేరదీసి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు.

తలనీలాల టెండర్ నిలుపుదల

శ్రీశైలం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం క్షేత్రంలో యాత్రికులు మొక్కులుగా సమర్పించుకునే తలనీలాల స్వాధీనపర్చుకునే టెండర్‌ను తాత్కాలికంగా నిలిపివేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. గతంలో తలనీలాలను స్వాధీనపర్చుకునేందుకు సంవత్సరానికి సుమారు రూ.5కోట్లు వెచ్చించి టెండరు దక్కించుకున్నారు. ప్రస్తుతం జరగనున్న రెండేళ్లకాలం టెండరు ప్రక్రియను అమలు పరిచేందుకు ఈవో అందుబాటులో లేకపోవడంతో తాత్కాలికంగా వాయిదా వేసినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ టెండరు విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి త్వరలో పాలకమండలి ఆమోదంతో రీటెండర్‌ను నిర్వహిస్తారన్నారు.

వృద్ధురాలిపై కోతుల దాడి

రుద్రవరం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లవాగుపల్లె గ్రామానికి చెందిన వెంకటసుబ్బమ్మ అనే వృద్ధురాలిపై కోతులు శుక్రవారం దాడి చేశాయి. ఈ దాడిలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. ఇంటి ఆవరణంలో చెరవ (పాత్ర) తీసుకుని వెళ్తుండగా అందులో తినే పదార్థం ఉందని కోతులు దాడి చేశాయి. గాయపడ్డ వృద్ధురాలిని చికిత్స నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

నిరసన ప్రదర్శనలో వక్తల డిమాండ్



నిరసన ప్రదర్శనలో మాట్లాడుతున్న విరసం బాధ్యుడు పాణి

కర్నూలు కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కర్నూలు కలెక్టరేట్ ఎదుట వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కన్వీనర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షత జరిగిన ఈ ప్రదర్శనలో వామపక్షాలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ముందుగా కన్వీనర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ దేశంలో ప్రభుత్వాల పాలన నిరంకుశంగా ఉందని, రాజ్యాంగం హక్కులను అడుగడుగునా ఉల్లంఘిస్తున్నారని పేర్కొన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జిల్లా నాయకుడు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసులు, మావోయిస్టుల పట్ల దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే ఆపరేషన్ కగార్ పేరిట సొంత ప్రజల పైనే యుద్ధం చేస్తున్నాయని విమర్శించారు. . ప్రజాభ్యుదయ సంస్థ నాయకుడు భార్గవ మాట్లాడుతూ దేశంలో ఫాసిస్ట్ పాలకులు తమకు ఎన్నికల్లో విరాళాలు ఇచ్చి గెలిపించే అదాని కోసం ఆపరేషన్ కగార్ నడుపుతూ ఆదివాసులను, వారికి అండగా ఉన్న విప్లవకారులను హత్య చేస్తున్నారని అన్నారు. విప్లవ రచయిత సంఘం బాధ్యుడు పాణి మాట్లాడుతూ ఈదేశ మూలవాసులు నేలను, విలువైన వనరులను, ప్రకృతిని కాపాడుకోవడానికి భారత సైన్యంతోనే యుద్ధం చేస్తూ ఉన్నారని అన్నారు. ఇటీవల ఎన్‌కౌంటర్‌లో హత్యకు గురైనా మావోయిస్టు నాయకుడు హిడ్మా తమ నేల కోసం బిర్సాముండా, గోండు రాంజీ, అల్లూరి సీతారామరాజు ఉద్యమ వారసత్వాన్ని కొనసాగించారని అన్నారు. ఈ నిరసన ప్రదర్శనలో ఏఐటీయూసీ నాయకులు మునెప్ప, జగన్నాథం, రైతు కూలీ సంఘం నాయకుడు సుంకన్న, పౌర హక్కుల సంఘం నాయకుడు అల్లాబకాష్, కళాబృందం నాయకుడు పోతన్న, దళిత హక్కుల సంఘం నాయకుడు మహేష్, యువజన సమాఖ్య నాయకుడు శ్రీనివాస్, ఎస్‌డీపీఐ నాయకుడు చాంద్‌బాషా, రాయలసీమ విద్యావంతుల వేదిక కోకన్వీనర్ రత్నం ఏసేపు తదితరులు ప్రసంగించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం

● క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించండి : డీఈఓ శామ్యూల్‌పాల్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అతిథులు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని జోహరాపురంలో 69వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ (అండర్-17 బాలబాలికలు) కబడ్డీ పోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, విద్యావేత్త కేవీ సుబ్బారెడ్డి 18వ వార్డు కౌన్సిలర్ పద్మలతరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి విజేతలు కావాలన్నారు. గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. కర్నూలు జిల్లాలో కబడ్డీ క్రీడకు మంచి గుర్తింపు ఉందన్నారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం స్కూల్‌గేమ్స్ స్పోర్ట్స్ ఫ్లాగ్ ఆవిష్కరించారు. 13 జిల్లాల క్రీడాకారులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం కర్నూలు, నెల్లూరు జట్ల కబడ్డీ మ్యాచ్‌ను డీఈఓ టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ నిర్వహక కార్యదర్శి టి.కృష్ణ, కబడ్డీ సంఘం మాజీ కార్యదర్శి రాజశేఖర్, మాజీ కార్పొరేటర్ తిమోజీ, కరస్పాండెంట్ సోలేమాన్, సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు పాణ్యం గోపి జోహరాపురం వెంకటేశ్వర్లు, కోచ్ ఆనంద్, పోటీల పర్యవేక్షకులు బి.ప్రవీణ్ (నెల్లూరు) టి.లక్ష్మి కుమారి (అనంతపురం), న్యాయవాది రామశేషన్న, శేషిరెడ్డి, పుల్లన్న, కర్ణ, హరిప్రసాద్, పాణ్యం కరుణాకర్ రెడ్డి, తదితర వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

● ఆరుగురికి తీవ్ర గాయాలు



జూపాడుబంగ్లా/మిడుతూరు/గడివేముల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు మండలాల్లో రోడ్డు ప్రమాదాల్లో జరగ్గా ముగ్గురు మృతి చెందారు. ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలివీ.. జూపాడుబంగ్లా మండలంలోని తంగడంచ గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం మొక్కజొన్న లారీ బోల్తాపడింది. ఈ ఘటనలో శుక్రవారం ఒకరు మృతిచెందగా, ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. తూడిచర్ల గ్రామం నుంచి నందికొట్కూరు సమీపంలో ఉన్న రబ్బానీ గోదాముకు మొక్కజొన్న లారీ తీసుకెళుతుండగా తంగడంచ సమీపంలో బోల్తాపడింది. లారీలో మొక్కజొన్న సంచులపై ఉన్న తూడిచర్ల గ్రామానికి చెందిన హమాలీలు ఏడుగురిలో భరత్(32) వ్యక్తిపై సంచులు పడటంతో అక్కడిక్కడే మృతిచెందారు. రహదారిపై వెళుతున్న వాహనదారులు, తంగడంచ గ్రామస్థులు కలిసి సంచులు తీసేలోపు భరత్ మృతిచెందగా మిగతా ఆరుగురిని కాపాడారు. ప్రమాదం జరిగిన సమయంలో వాహనాల రాకపోకలు గంట వరకు స్తంభించిపోయాయి. గాయపడిన హమాలీలు వెంకటేశ్వర్లు, యుగంధర్, రహమ్మత్‌బాషా, శంకర్, శివరాముడు, పుల్లయ్యను చికిత్స నిమిత్తం కర్నూలు వైద్యశాలకు తరలించారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ అక్కడినుంచి పరారైనట్లు స్థానికులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మిడుతూరు: మండలంలోని తలముడిపి సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని బైక్‌పై వెళ్తున్న వెంకటేశ్వర్లు(34) అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ ఓబులేసు తెలిపిన వివరాలివీ.. వెంకటేశ్వర్లు నందికొట్కూరు పట్టణంలోని వాల్మీకి నగరంలో తన తల్లి రమణమ్మతో పాటు నివాసం ఉంటూ గౌండ పనికి వెళ్లేవాడు. శుక్రవారం మహానందికి వెళ్లి వస్తానని తన తల్లితో చెప్పి బైక్‌పై తెల్లవారు జామున బయలు దేరాడు. వెంటేశ్వర్లును తలముడిపి గ్రామ సమీపంలోని కుందూ వంతెన వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికి అక్కడే మృతి చెందాడు. వెంకటేశ్వర్లు సోదరుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవ పరీక్ష నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గడివేముల: మండలంలోని కొరపొలూరు గ్రామ సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు వెలుగోడు మండలంలోని రేగడగూడురు గ్రామానికి చెందిన శ్రీనివాసులు (50) తన ద్విచక్ర వాహనంలో గడివేముల నుంచి తన స్వగ్రామానికి వెళ్తుండగా మార్గం మధ్యలో కల్వర్టు వద్ద ఉన్న సూచిక బోర్డును ఢీకొట్టాడు. ద్విచక్రవాహనం అదుపుతప్పి కల్వర్టులో పడిపోగా శ్రీనివాసులు తీవ్రంగా గాయపడి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య మహాలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీసీ నాగార్జున్‌రెడ్డి తెలిపారు.

ఈ-తాండ్రపాడు పీహెచ్‌సీలో విచారణ

కర్నూలు హాస్పిటల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం ఈ-తాండ్రపాడు పీహెచ్‌సీలో ఎంపీహెచ్‌ఈవో మక్బుల్ సాహెబ్‌పై మెడికల్ ఆఫీసర్, కొందరు సిబ్బంది ఫిర్యాదు మేరకు ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.సత్యవతి విచారణ చేపట్టారు. ఎంపీహెచ్‌ఈవో మక్బుల్ సాహెబ్ నిర్లక్ష్యంగా, అసభ్యకరంగా మాట్లాడడని, ఈ-తాండ్రపాడు, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డా.మంజూషా, కొందరు వైద్యసిబ్బంది, డీఎంహెచ్‌వో భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎంహెచ్‌వో విచారణ అధికారిణిగా ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.సత్యవతిని నియమించారు. ఈమేరకు శుక్రవారం పీహెచ్‌సీలో ఉదయం నుంచి మధ్యా హ్నం వరకు ఆమె విచారణ జరిపారు. మెడికల్ ఆఫీసర్, వైద్యసిబ్బంది రాతపూర్వకంగా జరిగిన విషయాన్ని రాసి ఇచ్చినట్లు తెలిసింది. మెడికల్ ఆఫీసర్ డా.మంజూషా జిల్లా లోకల్ కమిటీకి ఫిర్యాదు చేయడంతో ఈ నెల 18వ తేదీన కమిటీ ఛైర్‌పర్సన్ డా.మాధవి శ్యామల, ఐసీడీఎస్ అధికారులు విచారణ కొనసాగిస్తున్నారు. దీనిపై కర్నూలు డీఎంహెచ్‌వో డా.ఎల్.బాస్కర్‌ను వివరణ అడుగగా ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌వో ఈ.తాండ్రపాడులో విచారణ చేపట్టారని, విచారణ నివేదిక రావాల్సి ఉందని తెలిపారు.

పొగాకు తోరణాలకు నిప్పు

● అన్నదాతకు సుమారు రూ.3 లక్షలు నష్టం

నందికొట్కూరు రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దుండగులు పొగాకు తోరణాలకు నిప్పంటించగా నాలుగున్నర ఎకరాల పొగాకు కాలి బూడిదయింది. మండలంలోని కొణిదేల గ్రామంలో ఈ ఘటన జరిగింది. వివరాలివీ.. కొణిదేల గ్రామానికి చెందిన రైతు మహేశ్ 15 ఎకరాల పొగాకు పంటను సాగు చేశారు. పంట పండించి కొణిదేల గ్రామం ఊరిబయట ముచ్చుమర్రి వైపు వెళ్తే రహదారి పక్కన పొగాకును తోరణాలు కట్టి ఆరబెట్టాడు. శుక్రవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు వాటికి నిప్పంటించారు. మంటలను ఆర్పడానికి ప్రయత్నించగా తోరణాలు అగ్నికి ఆహుతి అయిపోయాయి. రైతు మహేష్ మాట్లాడుతూ తాను గ్రామంలో 15 ఎకరాల దాకా ఐటీసీ కంపెనీ వారితో అగ్రిమెంట్ చేసుకుని సాగు చేశానని తెలిపారు. ఆరుగాలం కష్టపడి పెట్టుబడి పెట్టి పండించిన పంట కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది అధిక వర్షాలకు తుఫానులకు పొగాకు పంట బాగా దెబ్బతిని పసుపు రంగుకు మారిపోయి భారీగా నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ నష్టం నుంచి కోలుకోకముందే ఇలా జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు రూ.3 లక్షల దాకా నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముగ్గురు వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేశానని ఆయన తెలిపారు. నందికొట్కూరు ఎస్ఐ సురేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రైతు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తామన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో విఫలం



ధర్నాలో మాట్లాడుతున్న జే.మోహన్

గూడూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అటు పాలకులు ఇటు అధికారులు విఫలమయ్యారని సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి జే మోహన్ అన్నారు. శుక్రవారం గూడూరులోని నగర పంచాయతీ కార్యాలయం ముందు సీపీఎం ప్రాంతీయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు అధ్యక్షతన సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. జే మోహన్ మాట్లాడుతూ గూడూరులో తాగునీటి సమస్యను పరిష్కరించడంలో విఫలమయ్యారని ధ్వజమెత్తారు. ప్రజలపై పన్నుల భారం తప్ప ఏ సమస్య పరిష్కారం కావడం లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, మధు, శేఖర్, దానమన్న, నాగేష్, గుంటప్ప తదితరులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులకు జీతాలు చెల్లించాలి



ఎంహెచ్‌ఓకు వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గత నెల ఔట్ సోర్సింగ్ కార్మికులకు జీతాలు తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం నగర పాలక కార్యాలయంలో ప్రజారోగ్య అధికారి డా.నాగశ్రీప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ నగర పాలకలో పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న కార్మికులు గత నెల జీతాలు ఇంకా రాలేదని, దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సవారి, నాగేంద్ర, మాణిక్యం పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం ఉద్యమిద్దాం



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి శ్రావణిరెడ్డి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మహిళల హక్కుల కోసం సమరశీల పోరాటాలకు మహిళలంతా సిద్ధం కావాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్ల కార్యదర్శి శ్రావణిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం సీఆర్ భవన్‌లో జరిగిన సమాఖ్య నగర కౌన్సిల్‌సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం సనాతన ధర్మం ముసుగులో మహిళలను వంటింటికి బానిసలు చేయాలని చూస్తుందని మండిపడ్డారు. సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు గిడ్డమ్మ, నగర కార్యదర్శి భాతి, సీపీఐ నగర కార్యదర్శి రామక్రిష్ణారెడ్డి, రేణుక, ఆశాబేగం, కోటమ్మ, సోఫియా, పావని, సులోచనమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ వ్యర్థాలను నగర పాలకకే అప్పగించండి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్మాణ రంగంలో ఉత్పత్తి అయ్యే గృహ, భవన, మరమ్మతు వ్యర్థాలను తప్పనిసరిగ్గా నగర పాలక సంస్థ వాహనాలకే అప్పగించాలని కమిషనర్ పి.విశ్వనాథ్ శుక్రవారం తెలిపారు. ఎక్కడ పడితే అక్కడ వ్యర్థాలను పారబోసి నగరాన్ని అపరిశుభ్రంగా మార్చే చర్యలను ఎవ్వరు చేయవద్దని ఆయన సూచించారు. నగరంలో కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ కోసం ఆగస్టు 1 నుంచి నిర్మాణ వ్యర్థాల నిర్వహణకు కొత్త విధానాన్ని అమలు చేస్తున్నామని, ఈ విధానానికి ప్రజల్లో విశేష స్పందన లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు 250కి పైగా ట్రాక్టర్ల ద్వారా నిర్మాణ వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్ ప్రక్రియకు పంపించినట్లు ఆయన తెలిపారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం 1 నుంచి సాయంత్ర 4 గంటల వరకు రెండు ట్రాక్టర్లతో వరుసగా సేకరణ చేపడుతున్నామని తెలిపారు. ఒక్కో ట్రాక్టర్‌కు కేవలం రూ.500 రవాణా చార్జీ మాత్రమే యజమానులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ప్రజలు 7422992299కు కాల్ చేసి నిర్మాణ రంగ వ్యర్థాలను తప్పనిసరిగ్గా నగర పాలక సంస్థకే అప్పగించాలని ఆయన కోరారు. సేకరించిన వ్యర్థాలను జొహరాపురం డంప్‌యార్డు వద్ద ఉన్న సీఅండ్‌డి వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌కు తలరించి రీసైక్లింగ్‌కు వినియోగిస్తున్నామని తెలిపారు.

గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి పోరాడుదాం



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

సి. బెళగల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి పోరాడుదామని కర్నూలు ప్రగతి సమితి నాయకుడు శ్రీహర్ష అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గుండ్రేవుల ప్రాజెక్టును నిర్మించాలని వాల్ పోస్టర్లను విడుదల చేశారు. శ్రీహర్ష మాట్లాడుతూ గుండ్రేవుల ప్రాజెక్టును నిర్మాణం మొదలు పెడుతామని చెప్పడమే తప్పా ఇంత వరకు మొదలుపెట్టలేదన్నారు. 24, 25 తేదీలలో కర్నూలు గాంధీచౌక్ దగ్గర చేపట్టే జలసమర దీక్షకు జిల్లా నలుమూల నుండి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లు, బాషా శ్రీను తదితరులు ఉన్నారు.

హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

సి. బెళగల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ హాస్టల్‌లో చదువుతున్న 9, 10 తరగతి విద్యార్థులకు హాస్టల్ వార్డెన్ భాస్కర్ దుప్పట్లను పంపిణీ చేశారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.

మిరప పంట పరిశీలన



రైతులకు తెగుళ్లపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సి. బెళగల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంబంధహల్ గ్రామంలో రైతులు సాగు చేసిన మిరప పంటలను శుక్రవారం పరిశీలించారు. ఉద్యానవన శాఖ అధికారి మదన్‌మోహన్ మాట్లాడుతూ రైతులు అధికంగా మిరప పంటకు ఆకుముడత, మచ్చ తెలుగుతో పూర్తి పంటలు దెబ్బతిన్నాయన్నారు. పసుపు రంగు బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పసుపు రంగు బుట్టలను వాడకం వలన కొంత తెగుళ్లను అరికట్టవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఎరువాక కేంద్రం నిర్వాహకులు సుజాత, ఎంపీఈవోలు అనిఫ్, వెంకటేశ్వర్లు, రైతులు ఉన్నారు.

మొక్కజొన్నకు

మద్దతు కరువు..

- పెరిగిన పెట్టుబడులు ● గిట్టుబాటు ధర లేని వైనం
- కల్లాల్లోనే మగ్గుతున్న ధాన్యం
- దళారుల చేతుల్లో మోసపోతున్న రైతన్నలు



నన్నూరులో ఆరబెట్టిన మొక్కజొన్న



ఓర్వకల్లు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రేయింబవళ్లు కష్టపడి పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర కరువైంది. మొక్కజొన్నకు మద్దతు ధర లేక కల్లాల్లో రోడ్ల వెంట మగ్గుతున్నాయి. గత ఏడాది దిగుబడి, గిట్టుబాటు ధర ఉండడంతో ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారు. అయితే మద్దతు ధర కల్పిస్తామని ప్రభుత్వం చెబుతున్నా మాటలకే పరిమితమైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండలంలోని ఓర్వకల్లు, కన్నమడకల, పూడిచెర్ల, నన్నూరు, లొద్దిపల్లె, ఉయ్యాలవాడ, ఉప్పలపాడు, ఎన్.కొంతలపాడు తదితర గ్రామాల్లో మొక్కజొన్న 3వేల ఎకరాల్లో సాగు చేశారు. అయితే.. ఈ ఏడాది వర్షాలు బాగా పడటంతో ఎకరాకు 25 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అయితే దళారుల చేతుల్లో రైతులు మోసపోయి రైతులు క్వింటం రూ.1,700 నుంచి రూ.1,800లకు విక్రయిస్తున్నారు. గత ఏడాది ఎకరాకు 20 నుంచి 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అయితే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి విక్రయించడంతో క్వింటం రూ.2,400లకు కొనుగోలు చేసిందని, ఈ ఏడాదిలో నేటి వరకు కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళనలు చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి క్వింటం రూ.2,400లకు కొనుగోలు చేయాలని కోరుతున్నారు. గత మూడు సంవత్సరాలుగా వర్షాలు బాగా పడటంతో పంట దిగుబడి వచ్చినా గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తల్లడిల్లుతున్నారు. అయితే గిట్టుబాటు ధర లేకపోవడంతో ధాన్యాన్ని కల్లాల్లో, రోడ్ల వెంట ఆరబెట్టాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం స్పందిం చి ఓర్వకల్లులో మొక్కజొన్న విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యానికి మద్దతు ధర కల్పించాలి



పంటలకు పెట్టుబడులు పెరిగాయి. పంట దిగుబడి వచ్చినా గిట్టుబాటు ధర లేక తీవ్రంగా నష్టపోతున్నాం. మొక్కజొన్న పంటకు మద్దతు ధర రూ.2,500లు కల్పించాలి.

● గోవిందరెడ్డి, రైతు

విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



ఓర్వకల్లులో మొక్కజొన్న విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. ఈ ఏడాది వర్షాలు బాగా పడటంతో అధిక దిగుబడులు వచ్చాయని, అయితే దళారుల చేతుల్లో రైతులు మోసపోతున్నారు.

● శ్రీనివాసులు, రైతు

రోడ్డు ప్రమాదాలను నివారించాలి: ఎస్పీ



పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

గూడూరు నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలను నివారించాలని ఎస్పీ ఎస్పీ విక్రాంత్ పాటిల్ పోలీసులకు సూచించారు. రోజు వాహనాల తనిఖీలు చేపట్టాలన్నారు. శుక్రవారం మండలంలోని కె నాగలాపురం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తు వాటి పురోగతిపై కేసుల ఫైళ్ళను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలపై ఆరా తీశారు. డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌లపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలు చేపట్టి కేసులు నమోదు చేసి, శిక్షలు పడేలా చేయాలన్నారు. ప్రాపర్టీ కేసులను ఛేదించి రికవరీలు చేయాలన్నారు. బాధితులు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించినప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. సైబర్ నేరాలపై, మహిళల చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కర్నూలు డీఎస్పీ జె బాబు ప్రసాద్, డీసీఆర్‌బి సీఐ గుణశేఖర్ బాబు, కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు, కె నాగలాపురం శరత్ కుమార్ రెడ్డి ఉన్నారు.

● కె నాగలాపురం సుంకులాపరమేశ్వరి అమ్మవారిని ఎస్పీ విక్రాంత్ పాటిల్ దర్శించుకోన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారి పీఎస్ రాధాకృష్ణ, గ్రామ పెద్దలు గోపాల్ రెడ్డి, సురేష్, ఆలయ సిబ్బంది కేశవ ఎస్పీకి స్వాగతం పలికారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి

● ఏపీ అసెంబ్లీ కమిటీ చైర్ పర్సన్ గౌరు చరితారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీ అసెంబ్లీ కమిటీ, స్త్రీ, శిశు సంక్షేమ, వికలాంగ, వయోవృద్దుల సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ గౌరుచరితారెడ్డి సూచించారు. శుక్రవారం విజయవాడలోని అసెంబ్లీ కమిటీహాల్లో గౌరుచరితారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరీలు, కమిటీ మెంబర్లు, ఉన్నత అధికారులు పాల్గొన్నారు. వయోవృద్దులు, వికలాంగులు, వితంతువులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. అన్నివర్గాల అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అధికారులు, సభ్యులు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లినపుడు ఈ సమాచారాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. అదేవిధంగా సభ్యులు అడిగిన ప్రశ్నలు, వినతులకు సమాధానాలు ఇచ్చారు. సభ్యులు ప్రశాంతిరెడ్డి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

23న ఎస్టీయూ వార్షిక కౌన్సిల్ సమావేశం

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సలాం ఖాన్ ఎస్టీయూ భవన్‌లో ఎస్టీయూ 79వ జిల్లా వార్షిక కౌన్సిల్ సమావేశాన్ని ఈ నెల 23న ఆదివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.గోకారి, టీకే జనార్దన్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ఈ సమావేశానికి మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, ఎం.రఘునాథరెడ్డి, ఆర్థిక కార్యదర్శి కోటేశ్వరరావు, ఉపాధ్యాయ వాణి సంపాదకులు గాజుల నాగేశ్వరరావు, రాష్ట్ర పూర్వపు అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షణ్ముర్తి, హెచ్.తిమ్మన్న హాజరవుతారనీ తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు శేఖర్, ముదసీర్, గోవిందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కర్నూలు గ్రూపక్ ఆధ్వర్యంలో వన్ ఆంధ్ర మెడికల్ వారి సహకారంతో 77వ ఎన్‌సీసీ డే సందర్భంగా కర్నూలు బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం శుక్రవారం ఏర్పాటు చేసినట్లు వన్ ఆంధ్ర మెడికల్ కంపెనీ కమాండర్ మేజర్ చైతన్ రెడ్డి తెలిపారు. వారు మాట్లాడుతూ కర్నూలు గ్రూపులోని 9 ఆంధ్ర, 28 బెటాలియన్‌లోని క్యాడెట్లు 77 మంది రక్తదానం చేసినట్లు తెలియజేశారు. ఆంధ్ర మెడికల్ కంపెనీ కమాండర్ మేజర్ చైతన్యరెడ్డి, ఏవో అరుణ్, ఆఫీస్ సూపరింటెండెంట్ పవన్ కుమార్, ఎన్‌సీసీ ఇన్స్‌పెక్టర్లు రక్తదానం చేశారు.

రైతుకు ఎద్దులు అప్పగింత



రైతుకు ఎద్దును అప్పగిస్తున్న ఎస్ఐ సునీల్ కుమార్

ఓర్వకల్లు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చోరీకి గురైన ఎద్దులను పట్టుకొని పోలీసులు రైతుకు అప్పగించినట్లు ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపారు. వివరాలు.. మండలంలోని ఉప్పలపాడుకు చెందిన కమ్మరి మధుసూదన్ అనే రైతుకు చెందిన ఎద్దులు ఈనెల 7వ తేదీ రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకెళ్లారు. బాధిత రైతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రొద్దుటూరు టౌన్‌లో నివాసం ఉండే భూపతి అనే వ్యక్తి రెండు ఎద్దులను దొంగలించి మైదుకూరు ఎద్దుల సంతలో అమ్మడానికి తీసుకెళ్తున్నాడు. పోలీసులు పోలీసులు చాకచక్యంగా పట్టుకుని అరెస్టు చేశారు. వీటి విలువ రూ.3 లక్షలు ఉంటుంది. శుక్రవారం ఆఎద్దులను రైతుకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

శరీరం పనితీరును తెలిపేదే ఫిజియాలజీ



సదస్సును ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మానవ శరీర అంతర్గత నిర్మాణాల పనితీరు తెలిపేదే ఫిజియాలజీ విభాగానిదేనని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినరసమ్మ అన్నారు. శుక్రవారం మెడికల్ కాలేజీ న్యూలెక్చరర్ గ్యాలరీ ఫిజియాలజీ వారోత్సవాల ముగింపు కార్యక్రమానికి ప్రిన్సిపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతి విద్యార్థి శరీర అంతర్గత విభాగాల నిర్మాణం పనితీరు ప్రభావితమయ్యే అంశాలపై పూర్తిగా అవగాహన పెంచుకోవాలన్నారు. ఫిజియాలజీపై పట్టు సాధిస్తే అనాటమి, ఫార్మాకాలజీ, మైక్రోబయాలజీ, పెథాలజీ మెడిసిన్‌తో పాటు క్లీనికల్ విభాగాల్లో రాణించవచ్చునన్నారు. శరీర అంతర్గత నిర్మాణాలు ఆరోగ్యంగా ఉంటే రోగాలకు దూరంగా ఉండవచ్చునన్నారు. మరో ముఖ్యఅతిథి మైపర్ విద్యాసంస్థల అధినేత డా.ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ అంతర్గత ఆరోగ్యంతో పాటు మానవ శరీరం బయటి పరిస్థితులు కూడా అనుకూలంగా ఉంటే మనిషి సంతోషంగా ఉండగలరన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డా.సాయి సుదీర్, డా.విజయానంద్‌బాబు, డా.సింధియా శుభప్రద, ఫిజియాలజీ విభాగపు హెచ్‌వోడీ డా.సుదారాణి, అసోసియేట్ ప్రొఫెసర్ డా.రాధిక, డా.ఎలిజబెత్, డా.లక్ష్మి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

రైతు బజారులో రైతులే అమ్ముకోవాలి



మాట్లాడుతున్న సీఐ శేషయ్య

కర్నూలు అగ్రికల్చర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే రైతుల బజారుగా గుర్తింపు పొందిన కర్నూలు నగరంలోని సీ.క్యాంపు రైతుబజారులో రైతులే అమ్ముకోవాలని సీఐ శేషయ్య అన్నారు. శుక్రవారం సీ.క్యాంపు రైతుబజారులో పర్యటించారు. ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ, ఉద్యాన శాఖ అధికారి శివకుమార్, సెక్యూరిటీ గార్డులతో కలిసి ప్రతి అంగడి వద్దకు వెళ్లి రైతుల వివరాలను సేకరించారు. ప్రతి రోజు ఇద్దరు పోలీసులు రైతుబజారులోనే ఉంటారని, రైతులు ఇక భయం వీడి స్వేచ్ఛగా గ్రామాల నుంచి తీసుకువచ్చిన కూరగాయలను అమ్ముకోవాలని కోరారు. గుర్తింపు కార్డులు అందజేస్తామని, వాటిని కలిగి ఉంటేనే రైతుబజారులోకి అనుమతిస్తామని ఎస్టేట్ అధికారి కళ్యాణమ్మ, ఉద్యాన శాఖ అధికారి శివకుమార్ సీఐకి విన్నవించారు. రైతులు, పొదుపులక్ష్మి గ్రూపు మహిళలతో సీఐ శేషయ్య మాట్లాడారు. అనంతరం సీఐను సన్మానించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక



ఉపాధ్యాయులను అభినందిస్తున్న దృశ్యం

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్స్ కాలనీలోని గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు లికితశ్రీ, సేతురామ్ నాయక్ గత నెల 22న జరిగిన జిల్లా స్థాయి అంకుల్‌లో జూనియర్ అండర్-14 విభాగంలో బాస్కెట్‌బాల్ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణుప్రియ తెలిపారు. 24 నుంచి 26 తేదీల్లో అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

ఏఐటీయూసీ ఆటో స్టాండ్ ఏర్పాటు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వే స్టేషన్ వెనుక భాగంలో ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆటో స్టాండ్‌ను ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప ప్రారంభించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో మునెప్ప మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్నటువంటి ఆటో కార్మికు వ్యతిరేక విధానాల వల్ల ఆటో కార్మికుల భవిష్యత్తు దుర్భరం అవుతుందన్నారు. కార్మికులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఏ.ఈశ్వర్, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు బి.వెంకటేష్, ఆర్.కృష్ణారెడ్డి, నాగరాజు ఖాదర్ తదితరులు పాల్గొన్నారు

మొండి బకాయిదారులపై కొరడా



దుకాణాల ఎదుట ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

కర్నూలు న్యూసిటీ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థకు పన్నులు చెల్లింకుండా మొండిగా వ్యవహరిస్తున్న దుకాణదారులపై నగరపాలక అధికారులు కొరడా ఝుళిపిస్తున్నారు. శుక్రవారం యూకాన్ ప్లాజా, అబ్దుల్లాఖాన్ ఎస్టేట్, కృష్ణానగర్, అబ్బాసనగర్ ప్రాంతాల్లో రెవెన్యూ విభాగ సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ మేరకు రూ.15 లక్షలు వసూలు చేసినట్లు రెవెన్యూ ఆఫీసర్ జునైద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వో స్వర్ణలత, వాజిద్, ఆర్‌ఐలు భార్గవ్, తిప్పన్న, శంకర్ పాల్గొన్నారు.

కాల్వబుగ్గలో బహిరంగ వేలం



కాల్వబుగ్గలో వేలం నిర్వహిస్తున్న ఈవో మద్దిలేటి

ఓర్వకల్లు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం బహిరంగ వేలం పాటలు ఆలయ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ, ఈవో మద్దిలేటి ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటల్లో ఆలయంలో టెంకాయ అమ్ముకునేందుకు, పార్కింగ్ ఫీజు 1, 3వ అంగళ్లు, టెంకాయ చిప్పలు పోగు చేసుకునే హక్కులకు వేలం పాట నిర్వహించగా.. అయితే ఆలయంలో ఆలయంలో టెంకాయలు అమ్ముకునే హక్కు, పార్కింగ్ ఫీజుకు వేలం పాటలకు పాటాదారులు ముందుకు రాకపోవడంతో వాటిని రద్దు చేసి మళ్లీ వేలం పాట నిర్వహిస్తామని ఈవో మద్దిలేటి తెలిపారు. వేలం పాటల్లో 1, 3వ అంగళ్లు రూ.25వేలు, రూ.53వేలు, టెంకాయ చిప్పలు అమ్ముకునే హక్కు రూ.2,100లు పాట పాడి పాటాదారులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కాటినేని నాథాయణ, ధర్మకర్త కాకి దేవేంద్ర, గ్రామస్థులు వేణు, గొల్ల నాగరాజు, గువ్వ రవికుమార్, బజారు, పాటాదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో పైపులైన్ ఏర్పాటు చేసుకోవాలి

ఓర్వకల్లు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి పైపులైన్ ద్వారా ఓర్వకల్లు హబ్‌కు తీసుకెళ్తున్న పైపులైన్‌ను ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసుకోవాలని పూడిచెర్ల బాధిత రైతులు డిమాండ్ చేశారు. శుక్రవారం పూడిచెర్ల గ్రామంలో పట్టా భూముల్లో సర్వే చేసేందుకు వెళ్లిన మండల సర్వేయర్ శంకర్ మాణిక్యం సర్వేయర్లు కొలతలు వేస్తుండగా.. బాధిత రైతులు కొలతలు వేయరాదని అడ్డుకోవడంతో అధికారులు వెనుదిరిగారు. రైతులు మాట్లాడుతూ పూడిచెర్ల గ్రామంలో మైనార్టీ కాలనీ నుంచి కొండపైకి నీరు ఎక్కించి చెరువు నుంచి పైపులైన్ ఏర్పాటు చేసుకోవాలని డిమాండ్ చేశారు.

టీడీపీ, ప్రజల కోసం పని చేయడమే లక్ష్యం



వహీద్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

కర్నూలు అర్బన్, నవంబర్ 21(ఆంధ్రజ్యోతి): పార్టీ, ప్రజలు, పేదల కోసం పని చేయడమే తన జీవిత లక్ష్యమని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వహీద్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యకర్తలు, నాయకుల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు వహీద్ నివాసానికి చేరుకుని పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఆనాథ శరణాలయాన్ని సందర్శించి నిత్యావసరాలను అందజేశారు.

ప్రివిలేజ్ కమిటీలో కోడుమూరు ఎమ్మెల్యే

● సమావేశంలో ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్చ



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విజయవాడలోని అమరావతి నందు అసెంబ్లీ మీటింగ్ హాల్‌లో శుక్రవారం జరిగిన ప్రివిలేజ్ కమిటీ సమావేశంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొన్నారు. ఈసమావేశానికి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్ పితాని సత్యనారాయణ అధ్యక్షత వహించగా ఈ కమిటీలో పలువురు ఎమ్మెల్యేలు సభ్యులుగా ఉన్నారు. అందులో కోడుమూరు ఎమ్మెల్యే కమిటీ సభ్యుడి హోదాలో సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో కొన్ని కీలక అంశాలుపై మాట్లాడారు. ప్రధానంగా నియోజకవర్గంలో ప్రొటోకాల్ పాటించని అధికారుల గురించి సమావేశంలో చర్చకు వచ్చినట్లు సమాచారం.

హనుమాన్ దీక్ష భక్తులకు అన్నదానం



అన్నదాన కార్యక్రమంలో ఆంజనేయ స్వామి దీక్షలో భక్తులు

కర్నూలు కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నగరంలోని బళ్లారి చౌరస్తాలోగల వీరాంజనేయ స్వామి దేవాలయంలో శుక్రవారం మధ్యాహ్నం మార్గశిర మాసం శుక్ల పక్షమి పాడ్యమి సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ దీక్ష స్వీకరించిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ అన్నదాన కార్యక్రమం మార్గశిర మాసం శుక్లపక్షం ఏకాదశి మంగళవారం వరకు కొనసాగుతాయని అన్నదాన కమిటీ నిర్వాహకులు తెలిపారు. దాతలు ఈ కార్యక్రమానికి సహకారం అందజేయాలని భావిస్తే ఆలయంలోని కమిటీ వారిని సంప్రదించాలని వారు కోరారు.

ప్రజా దర్బార్‌కు విశేష స్పందన



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే డా. పార్థసారథి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. అనేక మంది వికలాంగులు సదరన్ సర్టిఫికెట్ల కోసం ఎమ్మెల్యే కు వినతిపత్రాలు ఇవ్వడం జరిగింది. హానవాళు, సాంబగల్లు గ్రామాలకు చెందిన కొందరు తమకు ఇంటి పట్టాలు ఇచ్చారు గాని, అధికారులు స్థలాలు చూపించలేదని ఫిర్యాదు చేశారు. ప్రతి ఒక్క ఫిర్యాదుకు అక్కడికక్కడే ఎమ్మెల్యే సంబంధిత అధికారితో ఫోన్‌లో మాట్లాడుతూ వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ తెలుగుదేశం పార్టీ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



వినతులు స్వీకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు

ఆదోని, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆయన స్వగృహంలో నిర్వహించిన 'ప్రజాదర్బార్' కార్యక్రమంలో ప్రజల నుంచి పలు సమస్యలపై అర్జీలను స్వీకరించారు. ఆదోని నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో వినతి పత్రం అందించారు. టీడీపీ సీనియర్ నేత ఉమాపతినాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు శివప్ప, మదిరే వీరేష్, లక్ష్మీనారాయణ, అప్సర్‌బాషా పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

ఆదోని రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆదోని మండలం ఢణాపురం గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకొని ఆంజనేయస్వామికి బంగారు, వెండి ఆభరణాలతోపాటు వివిధ రకాల పుష్పాలతో అలంకరించి పండితులు పూజలు నిర్వహించారు.

'తప్పులు లేకుండా ఓటరు జాబితాను సిద్ధం చేయండి'



క్లాప్‌మిత్రలకు శిక్షణ ఇస్తున్న అధికారులు

ఆదోని రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి తప్పులు లేకుండా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని ఎలెక్షన్ డీటీ గాయత్రి తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో బిఎల్‌ఓల సమావేశం నిర్వహించారు. ఇంటింటికెళ్ళి ఓటరును అడిగి ఓటరు జాబితాలో ఉన్న తప్పు ఒప్పులను సరి చేయడంతోపాటు నూతన ఓటర్లను జాబితాలో చేర్చాలన్నారు. ఇంటి వద్ద కూర్చొని ఓటరు జాబితాను సరిచేయవద్దని వారికి సూచించారు.

స్వర్ణ పంచాయతీకి సహకరించండి

మద్దికెర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన మద్దికెర గ్రామంలోని ప్రజలు ఇంటి, కొళ్లాయి పన్నులను సకాలంలో చెల్లించి స్వర్ణ పంచాయతీకి సహకరించాలని సర్పంచ్ బండారు సుహాసిని, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ అన్నారు. మద్దికెర గ్రామంలో 4వేల గృహాలు ఉన్నాయని, 3,900 గృహాలకు ఆధార్ లింక్ చేశామనీ, మరో వంద గృహాలకు ఆధార్ లింక్ కావాల్సి ఉందని గృహాల యజమానులు ఆధార్ లింక్ చేయించుకోవాలని కోరారు. ప్రజలు పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని తెలిపారు.

ట్రెజరీ శాఖ ద్వారా మెరుగైన సేవలు

ఆలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ట్రెజరీ శాఖ ద్వారా ఉద్యోగులకు మెరుగైన సేవలు అందేలా చూస్తున్నామని ట్రెజరీ శాఖ జిల్లాధికారి సుబ్బరాయుడు తెలిపారు. శుక్రవారం ఆలూరు సబ్‌ట్రెజరీ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. రిటైర్డ్ ఉద్యోగుల కోసం సులభంగా లైఫ్ సర్టిఫికెట్ సమర్పించేందుకు ఉన్నచోట నుంచే థంబ్ వేసే వెసులుబాటును కల్పించామన్నారు. ఆయన వెంట సీనియర్ అకౌంటెంట్ భాస్కర్‌రెడ్డి, ఆలూరు సబ్ ట్రెజరీ అధికారి శ్రీనివాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల హాస్టల్ విద్యార్థులకు శుక్రవారం సహాయ సాంఘిక సంక్షేమ శాఖ అధికారి వెంకట్రాముడు, వార్డెన్ నాగమద్దయ్య దుప్పట్లు పంపిణీ చేశారు.

కాంప్లెక్స్ నిర్మాణానికి
రాజకీయ గ్రహణం..

● హైకోర్టు ఉత్తర్వుల బేఖాతరుతో పుర అధికారులపై ఉల్లంఘన కేసు నమోదు
● రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు సతమతం
● ప్రశ్నార్థకంగా మారిన మెగా కాంప్లెక్స్ నిర్మాణం

ఆదోని టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాత బస్టాండ్ స్థలంలో నిర్మిస్తున్న మెగా కమర్షియల్ కాంప్లెక్స్ కాంట్రాక్టర్ రాజేంద్రప్రసాద్‌కు 8 వారాలలో బిల్లును చెల్లించాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సకాలంలో అమలు చేయడం లో విఫలమైన పుర అధికారులపై సదరు కాంట్రాక్టరు కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కేసు పెట్టారు. వ్యవహారం ముదరడంతో పట్టణ నడిబొడ్డున రూ. 33 కోట్ల అంచనాలతో జరుగుతున్న మెగా కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో గుడ్‌విల్ పద్ధతిలో నాలుగు బ్లాకులుగా మంజూరు అయిన భారీ కాంప్లెక్స్ నిర్మాణం కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక 25 శాతం కన్నా తక్కువగా జరిగిన పనులను తాత్కాలికంగా ఆపేయాలన్న ప్రభుత్వ ఉత్తర్వులతో ఏడాది పాటు పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వ నిధులతో కాకుండా గుడ్‌విల్ పద్ధతిలో నిర్మాణం జరుగుతున్నందున తిరిగి పనుల ప్రారంభానికి గ్రీన్ సిగ్నల్ లభించడంతో పనులు వేగంగా కొనసాగుతున్నాయి. ఇంతవరకు జరిగిన నిర్మాణ పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు రూ. 3 కోట్ల బిల్లును చెల్లించడంలో అధికారులు తీవ్రంగా కాలయాపన చేయడంతో కాంట్రాక్టర్ హైకోర్టు జారీ చేసిన ఉత్తర్వుల గడువు ముగిసినా అమలు చేయకపోవడంతో కాంట్రాక్టర్ అధికారులపై కోర్టు ఉత్తర్వుల ఉల్లంఘన కేసును వేశారు.

రాజకీయ ఒత్తిళ్లు కారణమా : బిల్లు చెల్లింపు విషయంలో రాజకీయ ఒత్తిళ్లే కారణమని గుసగుసలు వినిపిస్తున్నాయి. అధికారుల ఆదేశాలతో కాంట్రాక్టర్ పనులను వేగవంతంగా చేస్తున్నా,



నిర్మాణంలో ఉన్న మెగా కాంప్లెక్స్

కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లింపులో జరుగుతున్నా జాప్యానికి కారణాలను మాత్రం అధికారులు స్పష్టంగా చెప్పలేకపోవడం విశేషం.

ఆందోళనలో లీజుదారులు: నిర్మాణం పనులు వేగంగా జరుగుతున్న సమయంలో కాంట్రాక్టర్ కు బిల్లు చెల్లించని కారణంగా తమకు షాపులను అప్పగించడంలో ఆలస్యం జరుగుతుందేమో అని షాపులను లీజుకు తీసుకొని రూ. లక్షలలో గుడ్‌విల్ చెల్లించిన వ్యాపారుల బెంబేలెత్తి పోతున్నారు. పట్టణానికి మణిహారంగా రూపుదిద్దుకోవాల్సిన మెగా కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణం పూర్తి అయితే మొత్తం నాలుగు బ్లాకులలో నిర్మించే 360 షాపుల నుండి పురపాలకానికి ప్రతి ఏడాది రూ. ఆరు నుండి ఏడు కోట్ల ఆదాయం లభించే అవకాశం ఉంది.

ఆలూరు అభివృద్ధికి లోకేశ్ హామీ

టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి



నారా లోకేశ్‌తో పోస్టర్‌ను విడుదల చేయిస్తున్న వైకుంఠం జ్యోతి

ఆలూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గ అభివృద్ధికి పూర్తి స్థాయిలో సహకరిస్తామని మంత్రి నారా లోకేశ్ హామీ ఇచ్చినట్లు టీడీపీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి తెలిపారు. శుక్రవారం విజయవాడలో లోకేశ్ స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలో నియోజకవర్గంలో చేపట్టనున్న ఇంటింటికి మీ వైకుంఠం జ్యోతి కార్యక్రమ పోస్టర్ మంత్రి నారా లోకేశ్ చేతులమీదుగా ఆవిష్కరించారు. ముఖ్యంగా తాగునీటి సమస్య పరిష్కారానికి రహదారుల నిర్మాణం కోసం హామీ ఇచ్చినట్లు ఆమె తెలిపారు. నియోజకవర్గంలో ఇన్‌చార్జి బాధ్యతలు చేపట్టాక పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషి పట్ల లోకేశ్ అభినందిచినట్లు తెలిపారు.

సీసీఐ కొనుగోళ్లు పారదర్శకంగా జరగాలి



ఆదోనిలో జిన్నింగ్ పరిశ్రమను పరిశీలిస్తున్న జేసీ నూరుల్ ఖమర్

● జేసీ నూరుల్ ఖమర్

ఆదోని అగ్రికల్చర్ నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : పత్తిని రైతుల నుంచి కనీస మద్దతు ధరతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా కొనుగోళ్లు పారదర్శకంగా జరిగేలా చూడాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్ చూడాలని అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఆయన సీసీఐ కొనుగోలు చేస్తున్న ఎన్‌డీబీఎల్ జిన్నింగ్ పరిశ్రమ దాదాపీర్ పత్తి జిన్నింగ్ పరిశ్రమను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ రైతులతో మాట్లాడారు. నిబంధనల వల్ల సీసీఐకి విక్రయించుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్లాట్ బుకింగ్ కావడం లేదని ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయత్నం చేస్తున్న ఫలితం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్లాట్ బుకింగ్‌లో తలెత్తుతున్న సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఆయన వెంట ఆదోని సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, మార్కెట్ యార్డ్ సహాయ కార్యదర్శి శాంతకుమార్, సూపర్వైజర్‌లు మోహన్ రెడ్డి, జిన్నింగ్ పరిశ్రమ యజమాని బత్తిని కుబేర్నాథ్, సీసీఐ ప్రతినిధి శ్రీనివాసులు ఉన్నారు.

'ఆదోని జిల్లా దీక్ష'కు బ్రాహ్మణ సంఘం మద్దతు

ఆదోని టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : ఆదోనిని జిల్లాగా ప్రకటిస్తూ నియోజవర్గాన్ని నాలుగు మండలాలుగా విభజించి ఆదుకోవాలని ఆదోని బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు నాఖతే శ్రీధర్ అన్నారు. ఆదోని జిల్లా సాధన కోసం జరుగుతున్న రిలే నిరాహార దీక్షకు వీరు తమ మద్దతు తెలుపుతూ, శుక్రవారం దీక్షలో కూర్చొన్నారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు వెల్లాల మధుసూదన్‌శర్మ, మఠం రామచంద్ర, దేశాయ్ గిరి, భీమసేన చారి, మఠం శంకర శాస్త్రి, కరణం మంజునాథ్, వైద్యం నాగరాజు మధుసూదన్ రావు గరుడాద్రి దత్తాత్రేయ శర్మ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి

మద్దికెర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని మండల విద్యాధికారి రంగస్వామి తెలిపారు. శుక్రవారం మద్దికెర మండలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో పాఠశాలలను పరిశీలించారు. ముందుగా మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులకు నాణ్యమైన విద్య భోజనం అందించాలన్నారు. ఉపాధ్యాయులు సకాలంలో విధులకు హాజరు రావాలని అన్నారు. సులభ పద్ధతుల్లో బోధన అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.


నేల ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

వెల్దుర్తి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దుర్తి డా.బీఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో శుక్రవారం సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో జిల్లా వ్యవసాయ అధికారులు హరిప్రియ, మంజుల ' నేల ఆరోగ్యం' పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులచేత క్షేత్రస్థాయిలో మట్టి నమూనా సేకరించే పద్ధతులను తెలియజేశారు. పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా భూసార పరీక్షల యొక్క ఆవశ్యకత మరియు నేల ఆరోగ్యం గురించి వివరించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసూన, ఉపాధ్యాయులు హరిత, రాజమ్మ, ఏవో అక్బర్‌బాషా, ఏఈవో అజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ పెరవలి అధ్యక్షుడిగా బుగ్గా భాస్కర్



భాస్కర్‌ను అభినందిస్తున్న మాజీ జడ్పీటీసీ సభ్యుడు పురుషోత్తం చౌదరి

మద్దికెర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెరవలి గ్రామానికి చెందిన బుగ్గా భాస్కర్‌ను పెరవలి గ్రామ టీడీపీ అధ్యక్షునిగా ఎంపికయ్యారు. శుక్రవారం మాజీ జడ్పీటీసీ సభ్యులు పురుషోత్తం చౌదరి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బత్తిన వెంకట్రాముడు, మండల టీడీపీ అధ్యక్షుడు ఎస్.లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆదేశాల మేరకు ఎంపిక చేశారు. మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పెరవలి రామాంజనేయులు, టైలర్ హరి తదితరులుపాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరు చేయాలి

మద్దికెర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రజలు తడి చెత్త, పొడి చెత్తను వేరు చేయాలని డీఎల్‌పీవో రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆయా వీధుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని అన్నారు. నీటిని వేడి చేసి వడబోసి తాగాలని తెలిపారు. ఎంపీడీవో కొండయ్య, డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, ఉప సర్పంచ్ కవిరెడ్డి కృష్ణ, పాల్గొన్నారు.

పేదల గుండెల్లో ఎన్టీఆర్ పదిలం

● ఎన్టీఆర్ విగ్రహావిష్కరణలో
టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్యే శ్యాంబాబు



ఎడవలిలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న తిక్కారెడ్డి, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు

మద్దికెర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పేద ప్రజల గుండెల్లో స్వర్గీయ నందమూరి తారక రామారావు ఎప్పటికీ పదిలంగా చిరస్థాయిగా నిలిచిపోతారనీ టీడీపీ జిల్లా అధ్యక్షుడు ప్యాలకుర్తి తిక్కారెడ్డి, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎడవలి గ్రామంలో స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథులుగా తిక్కారెడ్డి, ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారనీ అన్నారు. మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి ఎంతో అభివృద్ధి చేశారనీ అన్నారు. పత్తికొండ తాలుకా ఎంతో వెనుకబడిన ప్రాంతమని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు ప్రస్తుత ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు కృషి చేస్తున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలో అభివృద్ధికి నోచుకోక రాష్ట్రం అధోపతంలో నడిచిందని ఆరోపించారు. వైసీపీ నాయకులు అభివృద్ధికి సహకరించకపోగా.. ఆరోపణలు చేయడం సిగ్గు చేటన్నారు. రాష్ట్రంలో ఆర్థికంగా లోటుబడ్జెట్ ఉన్నా కూడా సూపర్ సిక్స్ పథకాలన్నింటినీ అమలు చేస్తుందని గుర్తు చేశారు. హంద్రీనీవా కాలువ ద్వారా పత్తికొండ ప్రాంత ప్రజలు మంచి పంటలు పండించుకుంటున్నారనీ అన్నారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు పురుషోత్తం చౌదరి, జమేదార్ రాజన్న యాదవ్, సర్పంచ్ నంది కల్పన, పంచాయతీ సలహాదారులు నంది జయరాముడు, సింగిల్ విండో అధ్యక్షులు ఆకుల ఆనంద్, ఆకుల వేణుగోపాల్, తాలుకా తెలుగు యువత అధ్యక్షులు చంద్రశేఖర్ గౌడు, మండల టీడీపీ అధ్యక్షుడు ఎస్.లక్ష్మినారాయణ, గ్రామ టీడీపీ నాయకులు బేల్దార్ రాము, హుశేన్‌పీరా తదితరులు ఉన్నారు.

వైద్య విద్యను దూరం చేయడం అన్యాయం

తుగ్గలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఆశలతో వైద్యవిద్యను చేపట్టాలని వైద్యవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు దూరం చేయడం అన్యాయమని ఎంపీపీ రామాంజినమ్మ, వైసీపీ నాయకులు హనుమంతు అన్నారు. సర్పంచ్ పుష్పావతి, రవి, సురేంద్ర, గోపాల్,ఉన్నారు.

ఆదోని అగ్రికల్చర్ : ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రభుత్వం పీపీపీ విధానం తీసుకోరావడం దుర్మార్గమని వైసీపీ పట్టణ అధ్యక్షుడు దేవా అన్నారు. కార్యక్రమంలో నారాయణ ఇర్ఫాన్ బాషా పాల్గొన్నారు.

రహదారికి మోక్షం..

● 9 కిలోమీటర్లకు రూ.5 కోట్ల నిధులు మంజూరు
● ఎమ్మెల్యే కేఈ కృషి

తుగ్గలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రహదారి గుంతలు పడి ప్రయాణీకులు నరకం అనుభవిస్తుండటంతో స్పందించిన పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు రూ.5 కోట్ల నిధులు మంజూరు చేయించడంతో గుంతలు పడిన రహదారికి మోక్షం లభించింది. వివరాల్లోకి వెళితే.. మండల పరిధిలోని జొన్నగిరి నుంచి జి.ఎర్రగుడి వరకు 9 కిలోమీటర్లలో గుంతలు పడటంతో ఆ రహదారి మరమ్మతు కోసం రూ.5 కోట్లు నిధులు మంజూరయ్యాయి. అంతేగాకుండా గత కొన్నేళ్ల నుంచి ఈ గుంతలు పడిన రహదారిలో ప్రయాణం చేస్తూ ఎన్నో ప్రమాదాలు జరిగినా ఎవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారిని మరమ్మతులు చేపట్టారు. నిధులు మంజూరు కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలి

ఆలూరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాల సమగ్రాభివృద్ధికి ప్రతిఒక్కరూ తోడ్పడాలని ఆలూరు ఎంపీడీఓ మద్దిలేటిస్వామి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో క్లీన్ అండ్ గ్రీన్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య నిర్వహణ బాధ్యత సక్రమంగా ఉండాలన్నారు. ఏఓ రమాదేవి, ఈఓపీఆర్‌డీ హరూన్‌రషీద్, ఆలూరు ఇన్‌చార్జి ఈఓ జిలాన్‌బాషా పాల్గొన్నారు.

నియమాలు పాటించాలి

తుగ్గలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన తుగ్గలిలో వాహనాలు తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించి అన్ని రికార్డులు ఉండాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే.. కేసులు నమోదు చేయడంతో పాటు కఠిన చర్యలు తప్పవన్నారు.

కూలీలందరికీ అక్షర జ్ఞానం ఉండాలి

తుగ్గలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం కింద పని చేసే ప్రతి కూలి వేలిముద్రలు వేయకుండా అక్షరజ్ఞానం నేర్చుకుని సంతకాలు నేర్చుకోవాలని ఎంపీడీవో విశ్వమోహన్, ఏపీవో హేమసుందర్ అన్నారు. ఉపాధి హామీ పథకం కింద పని చేసే ప్రతి కూలి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వయోజన విద్య కింద ప్రతి ఒక్కరూ చదువుకుని మస్టర్లలో సంతకాలు చేసేలా చదవడం, రాయడం రావాలన్నారు. ఈసీ రాజశేఖర్, టీఏలు రామకృష్ణ, ఫరీదప్ప, చంద్ర, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఆదాయ వనరులను పెంచుదాం

హాలహర్వి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే ఆదాయ వనరులు పెంచుకోవాలని ఎంపీడీఓ వరలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె సర్పంచుల సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో కుళాయి పన్ను, ఇంటి పన్ను, ఆదాయం పెంచే స్థలాల్లో కాంప్లెక్స్‌ల నిర్మాణం పనులు చేపట్టాలన్నారు. వచ్చిన పన్నుల ఆదాయాన్ని ఎప్పటికప్పుడు ఖాతాలో జమ చేసి పోర్టల్‌లో నమోదు చేయాలని ఆమె సూచించారు.

పరిహారం చెల్లించాలి

పత్తికొండ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణ గిడ్డయ్య కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు అందించి ఆదుకోవాలని సీపీఐ జిల్లా సీనియర్ నాయకులు భీమలింగప్ప, చేతివృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి కారన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఏడాది మే నెలలో శ్రైలం మల్లికార్జునస్వామివారిని దర్శించుకుని వస్తుండగా నంద్యాల జిల్లా ఆత్మకూరు వద్ద వీరభద్ర కుమారుడు మంగలి గిడ్డయ్యతో పాటు నలుగురు కుటుంబ సభ్యులు ప్రమాదంలో మరణించడం జరిగిందన్నారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని మంత్రి నారా లోకేష్, జిల్లా కలెక్టర్ వాగ్దానం ఇచ్చారని, ఇంతవరకు ఆ కుటుంబానికి ఎలాంటి పరిహారం అందలేదని, ప్రభుత్వం స్పందించి బాధితా కుటుంబానికి రూ.10 లక్షలు పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

చెత్త నుంచి ఆదాయం

దేవనకొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో పారిశుధ్య పనుల నుండి వచ్చిన చెత్తను తడి, పొడి చెత్తగా వేరు చేసి ఆదాయ వనరుగా మార్చాలని ఎంపీడీవో జ్యోతి తెలిపారు. మండలంలోని కరివేములలో క్లాప్‌మిత్రల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టి, ఆనంతరం చెత్తసంపద కేంద్రంలో చెత్తను వేరు చేసే విధానం, వాటిని ఎలా సద్వినియోగం అయ్యోలా చుడాలో తెలియజేశారు. క్లాప్ మిత్రలు గ్రామాలలో పరిశుభ్రతకు పాటుపడాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో గోపాల్ పంచాయతి కార్యదర్శులు శివశంకర్‌సింగ్, నాగార్జున, సునీల్ పాల్గొన్నారు.

శ్రీమఠం పీఠాధిపతికి ఆహ్వానం

మంత్రాలయం/ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో డిసెంబరు 13న జరగబోయే హిందూ సమ్మేళనానికి మంత్రాలయం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థ స్వామిని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు ఆహ్వానించారు. శుక్రవారం బీజేపీ నాయకుడు గురురాజ్ దేశాయ్ మాట్లాడుతూ ఈ సమ్మేళన మహా సభకు దాదాపుగా 10వేల మంది హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయ కులు దయాసాగర్, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ నాయకులు నక్కలమిట్ట నరసప్ప, వీరేశ్, రామన్నగౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో కావలి ఎమ్మెల్యే

మంత్రాలయం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం నెల్లూరు జిల్లా కావలి టీడీపీ ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి కుటుంబ సమేతంగా శుక్రవారం మంత్రాలయానికి వచ్చారు. మహాముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్లు ఎస్ కే శ్రీనివాసరావు, వెంటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహామూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. బంగారు పల్లకీ సేవ చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఆయన వెంట ఏఏవో మాధవశెట్టి, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజాచార్ తదితరులు పాల్గొన్నారు.

రహదారి పరిశీలన

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సోగనూరు గ్రామానికి రూ.20లక్షలతో వేసిన బీటీ రోడ్డును టీడీపీ మండల కన్వీనర్ కేటీ వెంకటేశ్వర్లు, సోగనూరు గ్రామ టీడీపీ నాయకుడు జగదీష్ శుక్రవారం పరిశీలించారు. వారు మాట్లాడుతూ సోగనూరు గ్రామానికి బీటీ రోడ్డు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారన్నారు. వాహనదారులు, ప్రజలు ప్రమాదాలకు గురై మృత్యువాత పడడమేగాక, క్షతగాత్రులుగా మారరన్నారు. విషయాన్ని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన బీటీ రోడ్డును మంజూరు చేయించి ప్రజల కష్టాలు తీర్చారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని అన్నారు.

పోస్టర్ విడుదల



పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జమాతె ఇస్లామి ఆధ్వర్యంలో నవంబరు 21వ తేది నుంచి 30వ తేదీ వరకు పొరుగు వారి హక్కుల దేశవ్యాప్త ఉద్యమ పోస్టర్‌ను జమాతె ఇస్లామి అధ్యక్షుడు చాంద్, మక్కా మజీద్ ఇమామ్ సద్దాం హుసేన్ విడుదల చేశారు. పట్టణంలోని మజీద్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కుచించుకుపోతున్న మానవ సంబంధాలను పెంపొందించుకోవడానికి, ఏకాంత జీవితానికి అలవాటు పడుతున్న ప్రజల్లో పరస్పర మానవ సంబంధాలు పెంచడానికి, ప్రజలలో సామాజిక చింతన కలిగించడానికి, ఇరుగు పొరుగు వారితో సత్సంబంధాలు, ఇచ్చిపుచ్చుకునే పూర్వ సంప్రదాయాలు, పరస్పర సహాయసహకారాలు కలిగించడంలో భాగంగా పొరుగు వారి హక్కుల ఉద్యమం తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో అల్తాఫ్, లాల్‌సాబ్, ఖాదర్, అమీర్, అలీ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు



బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా ఈ 18న నిర్వహించిన చిత్ర లేఖనం, వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని ప్రభుత్వ మాచాని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కృష్ణమూర్తి అన్నారు. కార్యక్రమంలో దేవేంద్ర బాబు, ఉమాదేవి, వెంకటేశ్వరమ్మ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

'హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలి'

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల దగ్గర నుంచి అక్రమ వసూళ్ళు పాల్పడుతున్న బాలికల పాఠశాల హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు రఘు, శేఖర్, ఉదయ్, కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ కొన్ని వారాల క్రితం బాలికల పాఠశాల హెచ్‌ఎం కృష్ణమూర్తి విద్యార్థుల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని స్వయంగా ఆర్జేడీ, డీఈవో విచారణ చేపట్టారని, విద్యార్థులు స్వయంగా చెప్పినా చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. అవినీతి హెచ్‌ఎంకు వత్తాసు పలకడం తగదని అన్నారు.

'ఆ అధికారులను సస్పెండ్ చేయాలి'

పెద్దకడబూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ ప్రిన్స్‌పాల్‌కు వత్తాసు పలుకుతున్న అధికారులను సస్పెండ్ చేయాలి విద్యార్థి జేఏసీ సంఘం నాయకులు శేఖర్ నాయుడు, ఖాజా, ఉదయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పెద్దకడబూరులోని కేజీబీవీ ముందు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ గతంలో మద్దికెర కేజీబీవి ప్రిన్సిపాల్‌గా జ్యోతి విధులు నిర్వహిస్తూ అక్కడ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రిన్స్‌పాల్‌ను సస్పెండ్ చేయకుండా మధ్యంతర ట్రాన్స్‌ఫర్ చేయడం వెనుక దాగి ఉన్న అంతర్యమేమిటి అని ప్రశ్నించారు. అలాగే గతంలో విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ రుక్సానాను కొనసాగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు రఘు, కృష్ణ, రమేశ్, ఆనంద్, అశోక్, కిట్టు పాల్గొన్నారు.

'రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలి'

ఎమ్మిగనూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు కోఆర్డినేటర్ కాశీంవలి, వీరేష్ యాదవ్ కోరారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. నాయకులు ఆసిఫ్, షాకీర్, గణేశ్, లోకేశ్, అజయ్ ఉన్నారు.

రమణీయం.. రథోత్సవం



పార్లపల్లిలో గిడ్డాంజనేయస్వామి రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి



బసలదొడ్డి గ్రామంలో పైరాయ ఆంజనేయస్వామి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు



సుంకేశ్వరి గ్రామంలో రామలింగేశ్వరస్వామి రథోత్సవం

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పార్లపల్లి, పరమాన్‌దొడ్డి, మల్కాపురం, దైవందిన్నె, వెంకటగిరి తదితర గ్రామాల్లో శుక్రవారం కార్తీక దీపోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పార్లపల్లి గ్రామంలో ఉదయం నుంచి గిడ్డాంజనేయస్వామికి ప్రత్యేక పూజలతో పాటు సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి రథోత్సవంలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు. పరమాన్ దొడ్డి గ్రామంలో ఆంజనేయస్వామి ప్రభోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల కన్వీనర్ కేటీ వెంకటేశ్వర్లు, టీడీపీ మండల మాజీ కన్వీనర్ మల్లికార్జున, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం: మండలంలోని సుంకేశ్వరి గ్రామంలో రామలింగేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా ఊరేగించారు. శుక్రవారం ఉదయం నుంచి శివునికి, నందికి, శివలింగానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించి అలంకరించారు. రథంపై రామలింగేశ్వరస్వామి, విఘ్నేశ్వరుడు, శివలింగంను అలంకరించి ఊరేగించారు. మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

కోసిగి: మండల పరిధిలోని కార్తీక మాస పూజలు పురస్కరించుకుని శుక్రవారం రామలింగేశ్వరస్వామి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్ దర్శనం చేసుకుని రథోత్సవంలో పాల్గొన్నారు. ఉదయం నుంచి రామలింగేశ్వర స్వామికి భక్తులు పూజలు చేశారు. గ్రామ పెద్దలు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



సాతనూరులో రామలింగేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

పెద్దకడబూరు: బసలదొడ్డి గ్రామంలో వెలసిన పైరాయ ఆంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం భక్తులు పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులను తీర్చుకున్నారు. సాయంత్రం సంధ్యావేళలో స్వామివారి రథోత్స వాన్ని కనులపండువగా నిర్వహించారు. ఏఎస్ఐ ఆనంద్, శివరాము, పోలీసు సిబ్బంది ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

కౌతాళం: కౌతాళంలో శుక్రవారం కార్తీక మాసం సందర్భంగ కార్తీక పూజలను గ్రామంలోని తలారిగేరిలోని అంజనే యస్వామి దేవాలయం, ఎన్టీఆర్ నగర్‌లోని అంజనేయస్వామి దేవాలయంలో ఆయా కాలనీవాసులు, గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మాజీ సర్పంచ్ కేదరేశ్వరి సందర్శించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వీరి గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికి పూలమాల శాలువాలతో సన్మానించారు. ఆలయాల్లో అన్నదానం ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు ఉలిగయ్య, వెంకటపతిరాజు, మంజునాథ, రాజబాబు, రహిమాన్, సిద్దు, కురువ వీరేశ, రాజానందు ఉన్నారు.

ఆయకట్టు రైతుల్లో ఆనందం

● జీడీపీ కుడి కాలువ ద్వారా నీటి విడుదలపై హర్షం

గోనెగండ్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు ఆయకట్టు రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. శుక్రవారం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి ఆయకట్టు రైతులకు కుడి, ఎడమ కాలువల ద్వారా సాగునీరు విడుదల చేశారు. అధికారులు, నాయకులు 13వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తామని ప్రకటించారు. దీంతో రైతులు ఆనందం వ్యక్తంచేశారు. అయితే ప్రాజెక్టులో 3 టీఎంసీ నీరు ఉంది.

ప్రస్తుతం జీడీపీ లో 3 టీఎంసీల నీరు

జీడీపీ నీటి నిల్వ సామర్థ్యం 4.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం జీడీపీలో 3 టీఎంసీల నీరు ఉంది. ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్ననీరు వరద నీరు, హంద్రీ-నీవా, ఎల్లెల్సీ నుంచి మళ్లించిన నీరే. ఈ రబీలో 13వేల ఎకరాలకు సాగునీరు అందించి, వచ్చే ఏడాది వేసవిలో డోన్, పత్తికొండ, కోడుమూరు, కర్నూలు, గూడూరు, క్రిష్ణగిరి తాగునీటి పథకాలకు నీరు అందించవచ్చునని అధికారులు చెబుతున్నారు. నేటి నుంచి వచ్చే జూన్ నెల వరకు ప్రాజెక్టులో ఆవిరి రూపం లోదాదాపు 1టీఎంసీ పైగానే ఆవిరి అవుతుంది. పంటలు పూర్తి అయితే వరకు సాగునీరు ఇస్తామని నాయకులు చెబుతున్నారు.

కుడి కాలువ ద్వారా నీరు విడుదల

కుడి కాలువ ద్వారా శుక్రవారం నాయకుల, అధికారులు ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. ఎడవ కాలువ ద్వారా సోమవారం నుంచి నీరు విడుదల చేయనున్నారు. కుడికాలువ ద్వారా 150 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 50 క్యూసెక్కులు విడుదలవుతాయి. రైతులు తమ భూములను సాగుకు సిద్ధం చేసుకున్న తరువాత నీటి విడుదలను మరింత పెంచుతామని అధికారులు చెబుతున్నారు. రబీ సీజన్‌లో సాగు చేసుకునే పంటలు చేతికి వచ్చే వరకు సాగు నీరు అందిస్తామని జీడీపీ అధికారులు చెబుతున్నారు. మార్చి నెల చివరి వరకు నీటి విడుదల చేస్తామని, అయితే అప్పటి పరస్థితులను బట్టి నీరు మరిన్ని రోజులు విడుదల చేయాలా? నిలిపివేయాలా? అన్నది చూస్తామన్నారు. రైతులు ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని ఇరిగేషన్ అధికారులు సూచిస్తున్నారు.



సాగుకు సిద్ధం చేసిన ఆయకట్టు భూమి

పంట పూర్తయ్యే వరకు నీరు విడుదల చేయాలి

ఈ ఏడాది నీరు ఉన్నందున ఆయకట్టు భూములకు నీరు విడుదల చేస్తున్నారు. ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని అధికారులు తెలిపారు. అయితే ఏ పంటలు సాగు చేసినా పంటలు పూర్తిగా పండే వరకు పంటలకు నీరు విడుదల చేసి రైతును ఆదుకోవాలి.

- ఉరుకుందరెడ్డి, రైతు, వేముగోడు

అన్నదాతలకు ప్రభుత్వం అండ

గోనెగండ్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గోనెగండ్లలోని రైతు సేవా కేంద్రం దగ్గర శుక్రవారం పీఎం నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. గత నెలలో అధిక వర్షాల కారణంగా నష్టపోయిన గాజులదిన్నె, గంజహళ్లి, ఐరన్‌బండ గ్రామాల రైతులకు ఉచితంగా మినుములు పంపిణీ చేశారు. ఒక్కొక్క రైతు కు ఉచితంగా ఎకరంకు 8 కేజీల ప్రకారం పంపిణీ చేశారు. ఈ మూడు గ్రామాలకు 1200 కిలోల మినుములను ప్రభుత్వం విడుదల చేసింది. ప్రకృతి వ్యవసాయం వారు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను బీవీ పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ మహమ్మద్‌ఖాద్రీ, ఏవో హేమలత, సర్పంచ్ హైమావతి, తిరుపతయ్యానాయుడు, రామాంజినేయులు, జనసేన నాయకులు గానుగబాషా, మాలిక్‌బాషా, బీజేపీ నాయకుడు మునిస్వామి, పట్టణ అధ్యక్షుడు మహల్ రెహంతుల్లా, పట్టణ మాజీ అధ్యక్షుడు రమేష్‌నాయుడు, చంద్రశేఖర్, మురళీనాయుడు, నూరహమ్మద్, షేక్షావలి, రెహంతుల్లా, మిన్నల్ల, రంగస్వామినాయుడు, మునెప్ప, పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం : టీడీపీ



నందవరంలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

నందవరం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ కన్వీనర్ కాశీంవలి సింగిల్ విండో అధ్యక్షుడు గోపాల్ అన్నారు. శుక్రవారం నందవరంలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్ధిపొందిన రైతులు సంబరాలు చేసుకున్నారు. టీడీపీ కార్యాలయం వద్ద కూటమి నాయకులు సీఎం చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. నాయకులు వీరేశ్ పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుదాం



పంచాయతీ కార్యదర్శులకు సూచనలు ఇస్తున్న అధికారి

కౌతాళం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుదామని ఆదోని డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి బాలకృష్ణారెడ్డి అన్నారు. కౌతాళంతో పాటు మండల పరిధిలోని ఎరిగేరి, కామవరం, ఉరుకుంద గ్రామాల పంచాయతీలను శుక్రవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ అధికారులు గ్రామాల్లో చెత్తకుప్పలు పేరుకుండా ఎప్పటికప్పడు పరిశుభ్రంగా ఉంచి గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. గ్రామాల్లో శానిటేషన్ నిర్వహణ, వర్మీకంపోస్ట్ తయారీ, గ్రీన్ అంబాసిడర్ల విధుల నిర్వహణ పర్యవేక్షించాలన్నారు. గ్రామాల్లో ఇంటి పన్నులు, కొళాయి పన్నులు స్వర్ణ గ్రామపంచాయతీ పోర్టల్ ద్వారనే చెల్లింపులు చేయాలని సూచించారు. గ్రామాల్లో చెత్త కుప్పలు నిల్వ లేకుండా చూడాలన్నారు.

అనుమతుల్లేని లాడ్జీలను కూల్చేస్తాం

● 'కుడా' చైర్మెన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



అక్రమంగా నిర్మిస్తున్న హోంస్టేలను పరిశీలిస్తున్న సోమిశెట్టి

మంత్రాలయం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో పుట్టగొడుగుల్లా సొంత ఇంటినే హోంస్టేలుగా మార్చడం, అనుమతుల్లేకుండా నిర్మించిన లాడ్జీలకు నోటీసులిచ్చి కూల్చేస్తామని 'కుడా' చైర్మెన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. మంత్రాలయంలో అనుమతులు లేని హోంస్టేలు, లాడ్జీలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రామచంద్రనగర్‌లో ఇంటి అనుమతులు తీసుకుని హోంస్టేలుగా మార్చి భక్తుల నుంచి వేలల్లో దోచుకుంటున్నారని అన్నారు. ఇలాంటి వాటికి పంచాయతీ అనుమతులు ఇవ్వడం సరికాదని అన్నారు. కుడా అనుమతులు తీసుకోవాలని, నెల గడువులో నోటీసులిచ్చి యజమానులు స్పందించకపోతే నీరు, విద్యుత్ నిలుపుదల చేసి ఆపై కూల్చేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. పార్కింగ్‌కు స్థలాలు, అగ్నిమాపక ఏర్పాట్లు వంటి అనుమతులు లేకుండా లాడ్జీలు, హోంస్టేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుడా అధికారులు రాజు, టీడీపీ నాయకులు రాగన్న, రాజన్న తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తీర్చేందుకు ప్రజలకు నిరంతరం అందుబాటలో ఉంటూ కృషి చేస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మాధవరం తన నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోనే చాలా మంది అర్జీలు ఇచ్చేందుకు క్యూ కట్టారు. అర్జీలను తీసుకుంటూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతూ కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఏ కష్టం, సమస్యలు వచ్చినా తనకు గాని తన సోదరులు రఘునాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, తనయుడు రాకేష్‌రెడ్డి దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కరించి న్యాయం చేస్తామన్నారు. భూసమస్యలు, రెవెన్యూ, సీసీరోడ్లు, డ్రైనేజీ సమస్యలు, పింఛన్‌లు, ఇంటి స్థలాలు అధికంగా ఉన్నాయని తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఎస్‌ఎం గోపాల్‌రెడ్డి, రాజారెడ్డి, ప్లానింగ్ అధికారి రాజు, టీడీపీ నాయకులు గోపాల్‌శివ, లక్ష్మన్న, రామయ్య, పోలివీరేష్, బొజ్జప్ప, కేశన్న, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మత్స్యకారుల దినోత్సవం



మంత్రాలయంలో భీష్ముడు, గంగాదేవి చిత్రపటాలను ఊరేగిస్తున్న గంగపుత్రులు

మంత్రాలయం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో గంగపుత్రులు, భీష్మసేన సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గంగపుత్రుల సంఘం అధ్యక్షుడు శాంతయ్య, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, శివ, చిన్నభీమ, సుంకప్ప, పవన్‌కుమార్ ఆధ్వర్యంలో భీష్మ మహర్షి, గంగాదేవి చిత్రపటాలను ప్రత్యేక వాహనంపై అధిష్ఠించారు. అనంతరం తుంగభద్ర నది ఒడ్డున గంగాదేవి దేవాలయం నుంచి రాఘవేంద్ర సర్కిల్ వరకు ఊరేగించారు. తుంగభద్రనది ఒడ్డుకుచేరుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించారు. అనంతరం నది ఒడ్డున భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. గంగపుత్రుల సంఘం పెద్దలు రాము, బంగి భీమయ్య, సున్నం భీమయ్య, రామకృష్ణ, నరసింహ, నాగప్ప, నర్సప్ప, రామయ్య, రవి, రాము, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: చిన్నతుంబళం గ్రామంలో ప్రపంచ మత్స్యకారుల దినోత్సవేడుకలు గంగపుత్రుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గంగపుత్రులు నాయకులు మల్లికార్జున, నరసింహులు, తెలుగు వీరేష్ ముందుగా గంగమాత, అంబగిర చౌడయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు మహదేవ, హనుమంతు, తిక్కయ్య పాల్గొన్నారు.



చిన్నతుంబళంలో గంగమాత, చౌడయ్య చిత్రపటాలకు పూలమాలలు వేస్తున్న గంగపుత్రులు

తాగునీటి పైపులైన్ లీకేజీ

● పెద్దనేలటూరులో బురదమయంగా మారిన రోడ్డు



పైపులైన్ లీకేజీ నీటితో బురదమయంగా మారిన రోడ్డు

గోనెగండ్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దనేలటూరు గ్రామంలో కొన్ని రోజులుగా తాగునీటి పైపులైన్ పగిలిపోయి లీకేజీ అవుతోంది. ఈ లీకేజీ ప్రధాన రహదారిలో ఉండటంతో దారి అంత బురదమయంగా మారిపోయింది. వాహనాలకు, ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అలాగే లీక్ అయిననీరు అపరిశుభ్రంగా మారి మళ్లీ తాగునీటి పైప్‌లోకి వెళ్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. దీంతో ఆ నీరు తాగడం ఇబ్బంగా ఉందని, పంచాయతీ సిబ్బంది స్పందించి లీక్‌అవుతున్న పైపులైన్ కు మర్మత్తులు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

రైతుల హర్షం



కోసిగిలో నగదు డ్రా చేసుకుంటున్న రైతులు

కోసిగి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అన్నదాత సుఖీభవ రెండో విడతలో రూ.7వేలు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయడంతో రైతులు కూటమి ప్రభుత్వంపై హర్షం వ్యక్తం చేస్తూ బ్యాంకుల్లో తమ ఖాతాలో జమ అయిన డబ్బులు తీసుకునేందుకు బ్యాంకులకు క్యూ కడుతున్నారు. కోసిగి మండలంలో 9,578 మంది రైతులకు గానూ మొత్తం రూ.6.30 కోట్లు నిధులు రైతుల ఖాతాలో జమ కావడంతో అన్నదాతలు సంతోషం వ్యక్తం చేసుకున్నారు. మొదటి విడతలో రూ.7వేలు జమ కాగా, రెండో విడతలో రూ.7వేలు మొత్తం రూ.14వేలు అన్నదాత సుఖీభవ కింద రైతుల ఖాతాలో జమఅయ్యాయి.

రైతులకు ఎంతో మేలు

కూటమి ప్రభుత్వంలో రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకాల కింద మొదటి విడతలో రూ.7వేలు, ఇప్పుడు మరో రూ.7వేలు జమ అయ్యాయి. రైతుల కష్టాల సమయంలో ఈ నగదు ఎంతో ఉపశమనం కలిగించింది.

- పెద్ద లింగన్న, జూమాలదిన్నె గ్రామం